PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 167 | విజయవాడ, ఆదివారం 19 జనవరి 2025 | 8 + 8 పేజీలు+స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 19 January 2025 | Rs



సకాలంలో న్యాయ సేవలే ప్రథమ కర్తవ్యం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్

3



షమీ పునరాగమనం

8

- సిరాజ్, చాహల్ ఔట్
- ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించిన బిసిసిఐ

సంజీవనిగా 21ఎంపి సీట్లు

- విశాఖ ఉక్కుకు నిధులు తెచ్చాం • గోదావరి-బనకచర్ల గేమ్ ఛేంజర్
- మైదుకూరులో ఎన్‌టిఆర్ వర్ధంతి, స్వచ్ఛాంధ్ర సభల్లో సిఎం చంద్రబాబు



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

గత సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి పార్టీలకు లభించిన 21 ఎంపీ సీట్లు రాష్ట్రానికి సంజీవనిగా మారాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆయన కడప జిల్లా మైదుకూరులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు 29వ వర్ధంతి సభలో ప్రసంగించిన అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అన్ని సీట్లు ఇచ్చారు కాబట్టే, అమరావతిని గట్టెక్కించే ప్రయత్నంతోపాటు పోలవరం పనుల పూర్తికి, విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు అవకాశం లభించిందని తెలిపారు. మూతదశకు చేరిన విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడిరూ.11,400కోట్ల నిధులు తెచ్చామని చెప్పారు.

ఎన్‌టిఆర్ అంటే కేవలం మూడు అక్షరాలు కాదని, తెలుగువారి ఆత్మగౌరవమని చెప్పారు. సంక్షేమ పథకాల ఆద్యుడని, పేదవారి గుండెల్లో తీపి జ్ఞాపకమని, ప్రభుత్వమంటే పాలకులు కాదని, సేవకులని చెప్పిన నాయకుడని నివాళులర్పించారు. నదుల అనుసంధానం ద్వారా కరువు రహిత రాష్ట్రంగా మారుస్తామన్నారు. రూ.80 వేల కోట్లతో చేపట్టిన గోదావరి-బనకచర్ల అనుసంధానం ఓ గేమ్ ఛేంజర్‌గా నిలవనుందని పేర్కొన్నారు. పోలవరం నీటిని కృష్ణా డెల్టాకు తరలిస్తామని, కృష్ణా డెల్టాకు ఉపయోగించే నీటిని రాయలసీమకు తరలించి అక్కడి నుంచి సోమశిల, కండలేరును నింపడం ద్వారా తిరుపతి వెంకటేశ్వరుని పాదాలను తడుపుతామని చెప్పారు. సబ్సిడీతో కూడిన మైక్రో ఇరిగేషన్-మార్కెటింగ్ సదుపాయాల ద్వారా కడప జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మార్చవచ్చన్నారు. మైదుకూరును రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర జిఎస్‌డిపి 12.9 శాతం నుంచి 15 శాతానికి పెరగాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రూ.53 వేల కోట్లతో జాతీయ రహదారులు, రూ.70 వేల కోట్లతో రైల్వే లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెలాఖరుకు వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొస్తామని, ఏ పని కావాలన్నా ఒక మెసెజ్ చేస్తే చాలని చెప్పారు. కడపకు మిగతా 7లో

డిప్యూటీ సిఎంగా లోకేష్

- చంద్రబాబు సమక్షంలో ఆర్.శ్రీనివాసులరెడ్డి ప్రతిపాదన

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సిఎం చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి కోరారు. శనివారం ఆయన కడప జిల్లా మైదుకూరులోని ఓ ఫంక్షన్ హాలులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో నిర్వహించిన ఎన్‌టిఆర్ వర్ధంతి సభలో మాట్లాడారు. టిడిపి అధికారంలో లేనప్పుడు నారా లోకేష్ చేసిన కృషిని పరిగణలోకి తీసుకోవాలని, పార్టీ భవిష్యత్తు దృష్ట్యా యువరక్తం ఎక్కించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువతకు భరోసా లభించాలంటే లోకేష్‌ను డిప్యూటీ సిఎం చేయాలన్నారు. కాగా, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం చర్చనీయాంశమైంది.



కేంద్ర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్ కరత్, మాణిక్ సర్కార్

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు

- సిపిఎం స్వతంత్ర బలం పెంపుదల • వామపక్ష ఐక్యత బలోపేతం
- అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడల పంథాపై చర్చ : ప్రకాశ్ కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం అనుసరించనున్న రాజకీయ ఎత్తుగడ పంథాను పార్టీ 24వ అఖిల భారత మహాసభలో నిర్ణయిస్తామని ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్ కరత్ పేర్కొన్నారు. కోల్‌కతాలో జరుగుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సిపిఎం 24వ అఖిలభారత మహాసభలు తమిళనాడులోని మదురైలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరగనున్నాయని, ఇప్పటికే రాష్ట్రాల్లో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. పార్టీ భవిష్యత్తు రాజకీయ ఎత్తుగడల పంథా (పిటిఎల్)ను పార్టీ మహాసభ నిర్ణయిస్తుందని వివరించారు. దేశంలో ప్రస్తుతం హిందూత్వ, కార్పొరేట్ శక్తుల ప్రతినిధిగా మోడీ సర్కార్ ఉందని తెలిపారు. గత పదేళ్లగా దేశంలోని అధికారాన్ని, స్వతంత్ర సంస్థలను ఉపయోగించి తన ఎజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ఆ ఎజెండాలో హిందూరాష్ట్ర నిర్మాణానికి హిందూత్వాన్ని ముందుకు తీసుకురావడం, కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాల అమలు రెండు అంశాలని పేర్కొన్నారు. హిందూత్వ, కార్పొరేట్ బంధంతో మిళితమైన కేంద్ర సర్కార్‌కు వ్యతిరేకంగా ఎలా ఉద్యమించాలనేదానిపై పార్టీ అఖిల భారత మహాసభ ప్రధానంగా దృష్టి పెడుతుందని తెలిపారు. హిందూ మతోన్మాద, నయా ఉదారవాద విధానాలు రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, కనుక ఈ రెండింటికి వ్యతిరేకంగా ఏకకాలంలో ఉద్యమించాల్సి ఉందని పేర్కొన్నారు.

సిపిఎం స్వతంత్ర బలం పెంచుకోవడంపై పార్టీ మహాసభ నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. సిపిఎం బలంగా లేకపోతే, హిందూ మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాటం విజయవంతం కాదని పేర్కొన్నారు. అలాగే వామపక్షాల బలోపేతంపై మహాసభలో చర్చిస్తామన్నారు. గత మిగతా 7లో

నేడు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్ఐడిఎం ప్రాంగణాలు ప్రారంభం

- హాజరు కానున్న అమిత్ షా : ఎన్‌డిఆర్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్

2



కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- బాలానందన్ శతజయంతి సభలో సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

3



అమిత్‌షాతో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ భేటీ

విజయవాడకు అమిత్‌షా

- ఉండవల్లి నివాసం వద్ద బాబు, పవన్ స్వాగతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శనివారం సాయంత్రం విజయవాడకు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయనకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పౌరసంబంధాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి అమిత్‌షా నేరుగా ఉండవల్లిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు మంత్రులు, అధికారులు ఘనంగా స్వాగతం చెప్పారు. హోంమంత్రి గౌరవార్థం తన నివాసంలోనే చంద్రబాబు విందు ఏర్పాటు చేశారు. బాబుతో కలిసి పవన్ కల్యాణ్ కూడా ఈ విందులో పాల్గొన్నారు.

అనంతరం ఈ ముగ్గురు దాదాపు గంటసేపు సమావేశమైనారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని చంద్రబాబు నాయుడు సమావేశం అనంతరం ఎక్స్(ట్విట్టర్)లో పొందుపరిచారు. అమిత్‌షా ఎన్‌డిఆర్‌ఎఫ్ కేంద్రం, ఎన్ఐడియం పదో బెటాలియన్లను ఆదివారం ప్రారంభించనున్న సంగతి తెలిసిందే.

నేటి నుంచి ఇజ్రాయిల్ - హమాస్ కాల్పుల విరమణ

జెరూసలేం, గాజా : జెరూసలేం, గాజా : కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుండి గాజాలో అమలవుతుందని ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మజీద్ అల్ అన్సారి ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఉభయ పక్షాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రాతిపదికన గాజాలో ఆదివారం ఉదయం 8.30గంటలకు కాల్పుల విరమణ అమల్లోకి వస్తుంది. అత్యంత అప్రమత్తంగా వుంటూ, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అధికార వర్గాల నుండి వచ్చే సూచనలు, ఆదేశాల కోసం వేచి వుండాలని ఆయన పేర్కొన్నారు. శనివారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించింది. ఆరు గంటలకు పైగా సమావేశమై పూర్తిస్థాయి కేబినెట్ ఒప్పందానికి ఆమోద ముద్ర వేసినట్లు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. వచ్చే ఆరు వారాల్లో గాజాలో బందీలుగా వున్న 33మంది బందీలు విడుదలవుతారని, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్లలోని వందలాదిమంది పాలస్తీనియన్లను విడుదల చేయనున్నారు. మొదటి దశ ఒప్పందంలో భాగంగా 737మంది ఖైదీలు విడుదలవుతారని ఇజ్రాయిల్ న్యాయశాఖ వెల్లడించింది.

టిటిడిలో కేంద్రం జోక్యం!

భద్రతపై నేడు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం పరిశీలన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలనలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జోక్యం చేసుకొనేందుకు ప్రయత్నిస్తోంది. వైకుంఠ ఏకాదశి దర్శన టోకెన్ల జారీ సందర్భంగా ఈ నెల 8న సంభవించిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ నెల 13న అగ్నిప్రమాదం జరిగింది. వెంట వెంటనే జరిగిన రెండు సంఘటనలతో టిటిడిలో భద్రత, పాలనా వైఫల్యాలు ప్రముఖంగా ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో టిటిడిలో భద్రతా లోపాలను పరిశీలించి, తగు సలహాలిచ్చేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థ (ఎన్‌డిఆర్‌ఎఫ్) రంగంలోకి దిగింది. ఆ విభాగం అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలో బృందం ఈ నెల 19న టిటిడిని సందర్శించనుంది. ఈ మేరకు టిటిడికి కేంద్ర హోంశాఖ నుండి సమాచారం అందింది. కాగా టిటిడిలో వేలు పెట్టేందుకు ఎప్పటి నుంచో మోడీ ప్రభుత్వం ఎదురు చూస్తోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక లడ్డూ వివాదం తలెత్తిన సమయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు లడ్డూ తయారీలో కల్తీపై విచారణ పర్యవేక్షణ కేంద్ర హోంశాఖ నియంత్రణలోని సిబిఐ చేతికి వెళ్లింది. ఇప్పుడు టిటిడి భద్రత, పాలనలో జోక్యానికి ఎన్‌డిఆర్‌ఎఫ్‌ను ప్రయోగిస్తోందన్న విమర్శలు బయలు దేరాయి. కూటమి రాజకీయాల వల్లనే ఇప్పటి వరకు స్వతంత్రంగాన్న ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం టిటిడిలోకి కేంద్రం పరోక్షంగా చొరబడేందుకు అవకాశం ఏర్పడిందని ఆరోపణలొస్తున్నాయి.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమం

- పాలకుల నుంచే ప్రమాదం • చర్చా గోష్టిలో వక్తలు

2


సంజయ్ రాయ్ దోషి!

- ఆర్‌జి కర్ ఆస్పత్రి కేసులో వెలువడిన తీర్పు
- 20న శిక్ష విధిస్తానన్న న్యాయమూర్తి
- మిగిలిన వారి సంగతేంటి : బాధితురాలి తల్లి


కోల్‌కతా : దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దాలోని అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు శనివారం నిర్ధారించింది. 20వ తేదీన శిక్షను విధించినున్నట్లు న్యాయమూర్తి అనిర్బన్ దాస్ తెలిపారు. ఆ సమయంలో నిందితుడు, బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు రూమ్‌లోనే వున్నారు. సిబిఐ అందజేసిన సాక్ష్యాధారాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చినట్లు కోర్టు తెలిపింది. గతేడాది ఆగస్టు 9న ఆస్పత్రిలోకి ప్రవేశించిన నిందితుడు బాధితురాలిని హత్య చేసి ఆపై లైంగిక దాడికి పాల్పడ్డాడని న్యాయమూర్తి తెలిపారు. ఈ దారుణానికి మరణశిక్ష లేదా యావజ్జీవ శిక్ష విధించే అవకాశముందని చెప్పారు. భారత న్యాయ మిగతా 7లో

ప్రైవేట్ వలయంలో పారిశ్రామిక రంగం

కె. గడ్డెన్న



వ్యవసాయక రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలతో పోటీపడాలన్నా, తలసరి ఆదాయం పెరగాలన్నా పారిశ్రామిక రంగంలో పురోగతి అవసరం. ఏ ప్రణాళిక అయినా రాష్ట్రంలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ఉండాలే తప్ప నేల విడిచి సాము చేయనవదు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్ -2047' లో భాగంగా ప్రకటించిన పారిశ్రామిక విధానాన్ని పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితికి, అందులో పేర్కొన్న లక్ష్యాలకు పొంతనే కుదరడం లేదు. పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వ రంగం ప్రాధాన్యతను పూర్తిగా విస్మరించారు. రాయితీలు, ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు, ఇన్వెస్టర్లకు అనువైన ఎకో సిస్టమ్ ఏర్పాటు, చౌక లేబర్, తక్కువ ఉత్పత్తి వ్యయం చూసి పెట్టుబడిదారులు రాష్ట్రానికి క్యూ కడతారన్నట్లుగా ఓ రంగుల కలను ఈ విజన్ డాక్యుమెంట్ మన ముందు ఉంచుతున్నది.. గత ఏడాది మార్చిలో జగన్ ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక విధానం ప్రాధాన్యతల్లో కొన్ని మార్పు చేర్పులు చేసి వచ్చే అయిదేళ్లకు వర్తించేలా ఈ కొత్త పారిశ్రామిక విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చింది. పాత విధానంలో కల్పించిన వాటికి అదనంగా కొన్ని రాయితీలను ఇందులో ప్రకటించింది. మెకెన్సీ రూపొందించిన విజన్ -2020 ఓ ప్రహసనంగా ఎలా ముగిసిందో చూశాం. ఆ కాలంలో రాష్ట్రంలో రైతాంగ ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయి. ఆర్థిక అసమానతలు విజృంభించాయి. చివరికి ప్రాంతీయవాదంతో రాష్ట్రం రెండు ముక్కలైంది. ఈ అనుభవాలను పరిగణనలోకి తీసుకుని విభజనానంతర అవశేషాంధ్రప్రదేశ్ అభివృద్ధి పంథాను రూపొందించుకోడానికి బదులు రాష్ట్రాన్ని సంక్షోభ ఊబిలోకి నెట్టే నయా ఉదారవాద విధానాలనే మరింత జోరుగా అమలు చేసేందుకు పూనుకుంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రకటించిన వికసిత్ భారత్-2047కి అనుగుణంగానే స్వర్ణాంధ్ర విజన్-2047 తీసుకొస్తున్నట్లు చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించారు. మోడీ 'వికసిత్ భారత్' అన్నా, చంద్రబాబు విజన్ -2047 అన్నా వీటి వెనక ఉన్న ఫిలాసఫీ ఒక్కటే. "ప్రజల ప్రయోజనాల కన్నా కార్పొరేట్ల లాభాలే ముందు" అన్నదే వాటి లక్ష్యం. దీని నుంచి పుట్టుకొచ్చినవే చంద్రబాబు తారక మంత్రంగా పఠిస్తున్న ఈజ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పి-4 వంటి నినాదాలు. గత ప్రభుత్వం పోర్టులు, ప్రాజెక్టులు అదానీకి కట్టబెట్టి ఆంధ్ర ప్రదేశ్‌ను అదానీ ప్రదేశ్‌గా మార్చివేస్తే, .ఇప్పుడు కూటమి ప్రభుత్వం అవే విధానాలను మరింత దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. సౌర విద్యుత్ కాంట్రాక్టులను పొందడం కోసం అదానీ భారీగా ముడుపులు ముట్టజెప్పారని సాక్షాత్తూ అమెరికా న్యాయశాఖ అక్కడ కోర్టులో కేసు దాఖలు చేస్తే, అదానీతో కుదుర్చుకున్న సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకోడానికి కూటమి సర్కారు ససేమిరా అంటున్నది. పొరుగునున్న తమిళనాడు ప్రభుత్వం అదానీతో కాంట్రాక్టులను రద్దు చేసుకున్నట్లు ప్రకటించింది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం సెకి ఒప్పందాన్ని కొనసాగించడానికే నిర్ణయించుకుంది. దేశంలో పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేసిన రెండో పంచవర్ష ప్రణాళిక (1956-1961) భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనలో మిగతా 7లో



వివిధ రకాల పక్షులతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

ఘనంగా ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం

- పరిశ్రమల భాగస్వామ్యం, ఎకో-టూరిజంపై చర్చలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కేంద్రంగా మూడు రోజుల పాటు జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్ శనివారం ఘనంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. దీనికిముందు హెలీ క్రాస్ జంక్షన్ నుండి కళారూపాల ప్రదర్శన, మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ జూనియర్ కళాశాల మైదానం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మంత్రితోపాటుగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, టూరిజం ఆర్‌డి రమణ ప్రసాద్ హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. సాయంత్రం వివిధ స్కూలు విద్యార్థులతో సాంస్కృతిక, డ్యాన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సినీ ఆర్టిస్ట్ శివారెడ్డి మిమిక్రీ అలరించింది. ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఎంపిక చేసిన ఐదు వేదికలలో ఒకటైన మిగతా 7లో

మావోయిస్టు సీనియర్ నేత దామోదర్ మృతి

- మావోయిస్టుల లేఖ విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడపడంలో తనదైన ముద్ర వేసుకున్న మావోయిస్టు, ములుగు జిల్లా కాల్వపల్లి గ్రామానికి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు(50) బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ శనివారం లేఖ ద్వారా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది కాదు.. 18 మంది అమరులయ్యారని, అందులో సెంట్రల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన తలపై రూ.50 లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఆయనతోపాటు హుంగి (పిపిసిఎం), దేవా (పిపిసిఎం), జోగా (పిపిసిఎం), నరసింహారావు (పిపిసిఎం) మృతిచెందినట్టు పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 18 మందిని పార్టీ కోల్పోయిందని, ముఖ్యంగా బడే చొక్కారావు ధైర్య సాహసాలను ప్రదర్శించి పోరాడుతూ అమరుడయ్యాడన్నారు. సుమారు 5000 మందికి పైగా పోలీసులు అడవిలో బీభత్సం సృష్టించడంతోపాటు ట్రాక్టర్లకు, బండ్లకు నిప్పంటించి భయానక వాతావరణం కల్పించారని పేర్కొన్నారు. కాగా, హిడ్మా తమ్ముడు దేవా కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్టు తెలిసింది.

ఉద్యోగ సంఘాలతో చర్చించాలి

- గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సచివాలయాల రేషనలైజేషన్ కమిటీకి ఛైర్మన్‌గా ఉన్న రెవెన్యూశాఖ మంత్రి విధి విధానాలు ఖరారు చేసే ముందు అన్ని శాఖల ఉద్యోగ సంఘాలతో చర్చించి, వారి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సచివాలయ వ్యవస్థను రేషనలైజేషన్ చేయకుండా.. మాతృశాఖల్లో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సచివాలయ ఉద్యోగులందరినీ అన్ని శాఖల్లోని ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలని సూచించారు.

మాతృశాఖల్లో విలీనం చేయండి - ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం

సచివాలయ ఉద్యోగులను ఆయా మాతృశాఖల్లో విలీనం చేసి, తక్షణమే పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు.

హేతుబద్ధీకరణ వల్ల వ్యవస్థలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఎటువంటి ఉపయోగం లేకపోగా తీవ్రమైన పనిభారం పెరిగే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమం

- పాలకుల నుంచే ప్రమాదం
- చర్చా గోష్టిలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత రాజ్యాంగానికి పాలకుల నుంచి పెను ప్రమాదం పొంచి ఉందని, దీని నుంచి రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఉద్యమాలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (కెవి) స్మారక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన విజయవాడలోని హనుమాన్‌పేటలో ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించిన 'రాజ్యాంగానికి ప్రమాదం - కాపాడుకోవాలి అందరం' అనే అంశంపై శనివారం చర్చా గోష్టి నిర్వహించారు.

ఎపి రైతు సంఘాల కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాజ్యాంగానికి విరుద్ధంగా ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. రాష్ట్రాల హక్కులు హరిస్తున్నా రాజకీయ ప్రయోజనాల కోసం పాలకులు నోరెత్తడం లేదని చెప్పారు. వ్యవసాయంపై ఆధారపడిన దేశంలో రైతులు 56 రోజుల నుంచి ఉద్యమం చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు నెలకు సరాసరి ఆదాయం రూ.2,200 మాత్రమే ఉందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... పాలకుల నుంచే రాజ్యాంగాన్ని రక్షించాల్సిన వింత పరిస్థితి ప్రస్తుతం దేశంలో నెలకొందన్నారు. ఐలు కూడా 'సేవ్ కానిస్టిట్యూషన్' నినాదంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘాలకు అధికారంలో రావడంతో రాజ్యాంగానికి రక్షణ లేని పరిస్థితి నెలకొందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ తొలి నుంచి రాజ్యాంగానికి వ్యతిరేకంగానే ఉందని, మనువాదం అనుసరించి రాజ్యాంగాన్ని రూపొందించాలన్నది వారి విధానమన్నారు. న్యాయ వ్యవస్థను మనువాదులతో నింపుతున్నారని, విశ్వవిద్యాలయాలపై పెత్తనం కోసం యుజిసి అధికారులకు కోత వేస్తున్నారని తెలిపారు. కేరళ, తమిళనాడు తప్ప ఇతర ఏ రాష్ట్రాలు దీనిని వ్యతిరేకించలేదని చెప్పారు. ఈ చర్చాగోష్టికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించగా, రైతు కూలీ సంఘం నాయకులు సింహాద్రి ఝాన్సీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధి సంకు మనోరమ, సిపిఎం నాయకులు వి.ఉమామహేశ్వరరావు, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆడపాల లక్ష్మి, డివివిఎస్ వర్మ, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు చండూరు రంగారావు, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, ఎఐటియుసి నాయకులు రావుల రవీంద్ర, సి.భాస్కరరావు, రామ్మూర్తి తదితరులు ఈ అంశంపై ప్రసంగించారు. అంతకుముందు వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన 'దేశం ఎటుపోతుంది?' పుస్తకాన్ని సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



చర్చా గోష్టిలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

కె.వి సేవలు మరువలేం

ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ కాట్రగడ్డ వెంకటేశ్వర్లు (కె.వి) పని చేసిన సమయంలో విద్యార్థులకు చేసిన సేవలు మరువలేమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి రావు అన్నారు. సామాజిక నిబద్ధతతో ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు కృషి చేశారని చెప్పారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్‌గా రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారని తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను పోలీసుల బారి నుంచి అనేక మార్లు కాపాడారని చెప్పారు. కెవి నుంచి తాము ఎంతో స్ఫూర్తి పొందామని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఈ సందర్భంగా కె.వి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె.వి వద్ద విద్యనభ్యసించిన మనోరమ, వర్మ, రామ్మూర్తి, నారాయణమూర్తి తదితరులు కె.వి సేవలను కొనియాడారు.

అడ్డదారిలో పదోన్నతులు

- 22న సత్యాగ్రహ మౌనదీక్ష
- డిపిసి జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లెక్చరర్లకు అడ్డదారిలో పదోన్నతులు ఇచ్చారని, వాటిని రద్దు చేయాలని డిపిసి జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా, సీనియార్టీ జాబితాను బయట పెట్టకుండా, అభ్యర్థుల సర్వీస్ వెరిఫికేషన్ చేయకుండా అనర్హులైన వారికి గత ప్రభుత్వంలో పదోన్నతులు ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురవయ్య, దేవరకొండ మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యలో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులను జిఒ 302 ద్వారా ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికన ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పదోన్నతులు పొందుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు ఒక్క పదోన్నతి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే ముందు మార్చి 15న డిపిసి అధ్యాపకులను పక్కనపెట్టి సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి అనర్హులైన 197 మందికి అడ్డదారిలో పదోన్నతులు కల్పించారని వివరించారు. కోర్టు కొట్టివేసినా కూడా ఈ పదోన్నతులను కొనసాగించారని అన్నారు. ప్రమోషన్ ప్యానల్ ఆగస్టు 31తో ముగిసినప్పటికీ డిసెంబర్‌లో 38 మంది జూనియర్స్‌కు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించారని వివరించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీటిని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని అధికారులు, నాయకులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ పదోన్నతుల్లో జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు డిపిసి జిజెఎల్‌ఎ అధ్యాపక బృందం ఈ నెల 22న ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం వద్ద సత్యాగ్రహ మౌనదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

జిఓ 53 రద్దు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని మాదాసి కురువ/ మాదరి కురువ కులానికి చెందిన వారికి కుల, ఆదాయ, నివాస, పుట్టిన తేదీ తదితర ధ్రువ పత్రాలను మండల తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ హోదాలోని అధికారులు జారీ చేసేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2022లో జారీ చేసిన జిఓ 53ను హైకోర్టు రద్దు చేసింది. ఈ జిఓ సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు వ్యతిరేకమని చెప్పింది. మాదాసి కురువ / మాదరి కురువ కులస్తులకు ధ్రువ పత్రాలను రెవెన్యూ సబ్ డివిజినల్ ఆఫీసర్ లేదా డిప్యూటీ కలెక్టర్ లేదా డిప్యూటీ కమిషనర్లు మాత్రమే జారీ చేయాలంది. మండల స్థాయిలో ధ్రువ పత్రాలను జారీ చేయడానికి వీల్లేదని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

నేడు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌ఐడిఎం ప్రాంగణాలు ప్రారంభం

హాజరు కానున్న అమిత్ షా : ఎన్‌డిఆర్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్

ప్రజాశక్తి- గన్నవరం - అమరావతి బ్యూరో

కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్‌డిఆర్‌ఎఫ్ కేంద్రం, ఎన్‌ఐడిఎం పదో బెటాలియన్ ప్రాంగణాలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం ఉదయం 11:30 గంటలకు ప్రారంభిస్తారని ఎన్‌డిఆర్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్ (డిజి) పీయూష్ ఆనంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కొండపావులూరులోని నూతన ప్రాంగణాల వద్ద జరుగుతున్న ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌ఐడిఎం బృందాల రిహార్సల్స్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీయూష్ ఆనంద్ మాట్లాడుతూ ఎన్‌డిఆర్‌ఎఫ్ కేంద్రం, ఎన్‌ఐడిఎం పదో బెటాలియన్ ప్రాంగణాలను అమిత్ షా స్వయంగా హాజరై, తిరుపతి, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్‌లలో జరిగే పలు కార్యక్రమాలను వర్చువల్ ద్వారా ఇక్కడ నుంచే ప్రారంభిస్తారని తెలిపారు. 2005 విపత్తు నిర్వహణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత 2006 జనవరి 19న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్) ఏర్పాటైందన్నారు. ఈ దళానికి న్యూఢిల్లీలో ప్రధాన కార్యాలయంతోపాటు నాలుగు జోన్లు ఉన్నాయని తెలిపారు. ఎనిమిది బెటాలియన్లతో ప్రారంభమై నేడు 16 బెటాలియన్లకు పెరిగిందన్నారు. ఇది 28 ప్రాంతీయ ప్రతిస్పందన కేంద్రాలు (ఆర్‌ఆర్‌సిలు), 24 టాక్టికల్ ప్రీ-పొజిషనింగ్ లొకేషన్లు (టిపిఎల్‌లు) సహా 68 ప్రదేశాల్లో ఏర్పాటయ్యాయని తెలిపారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ ప్రతి బెటాలియన్‌లో 18 ప్రత్యేక శోధన, రెస్క్యూ (ఎస్‌ఎఆర్) బృందాలు ఉన్నాయన్నారు. స్వయం సమృద్ధి, ఇంజనీర్లు, ఇతర సాంకేతిక నిపుణులు, ఎలక్ట్రీషియన్లు, డాగ్ స్క్వాడులు, వైద్య-పారా మెడికల్ సిబ్బంది వంటి నిపుణులను కలిగి ఉందని తెలిపారు. 2018లో నేషనల్ సివిల్ డిఫెన్స్ కాలేజ్ (ఎన్‌సిడిసి) విలీనం తర్వాత ఎన్‌డిఆర్‌ఎఫ్ అకాడమీ ఏర్పడిందని వివరించారు. 2024లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు రికార్డు స్థాయిలో 1038 ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో నాలుగు వేల మందికిపైగా ప్రజల ప్రాణాలను కాపాడినట్లు చెప్పారు. 63 వేల మందినిపైగా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. త్వరలో నాగ్‌పూర్‌లో కొత్త క్యాంపస్ ఏర్పాటు కానుందని చెప్పారు. మీడియా సమావేశంలో ఐజి నరేంద్ర సింగ్ గుందేల తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు

నేడు రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసనలు

భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పర్యటనను నిరసిస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిని జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు.

అంబేద్కర్ విగ్రహాల వద్ద కాంగ్రెస్ నిరసనలు

అమిత్ షా రాకకు వ్యతిరేంగా రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసనలు తెలపాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయనకు అతిథి మర్యాదలు చేసే వాళ్లు కూడా దేశానికి ద్రోహం చేసినట్లేనని చెప్పారు. రాష్ట్రంలోని దళిత, బహుజన, ఆదివాసీ, మైనార్టీ ప్రజలపై గౌరవం ఉంటే అమిత్ షాను బహిరంగ క్షమాపణకు డిమాండ్ చేయాలని కోరారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు విడుదల చేసినంత మాత్రాన ఉద్ధరించినట్లు కాదని, ఈ ప్యాకేజీతో ఫ్యాక్టరీకి ఒరిగేదేమీ లేదని ఆమె పేర్కొన్నారు.

డయాఫ్రం వాల్ పనులు ప్రారంభం


- ఇరిగేషన్ సిఇ నరసింహమూర్తి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో వేగవంతంగా డయాఫ్రం వాల్ పనులు చేపడతామని ఇరిగేషన్ సిఇ నరసింహమూర్తి తెలిపారు. శనివారం పోలవరం ప్రాజెక్టులో భూమి పూజ చేసి ఇరిగేషన్ అధికారులు పనులు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా సిఇ మాట్లాడుతూ.. అంతర్భాగంలో ప్లాస్టిక్ కాంక్రీట్ నదీ గర్భంలో మూడు వందల మీటర్ల మేర దిగువకు పంపడానికి సరిపడా రెండు సెట్లు సిద్ధం చేశామని తెలిపారు. ఏకకాలంలో 600 మీటర్ల పనులకు సరిపడా పైపులు సిద్ధం చేశామని, ఒకేసారి ఆరు ఫే నళ్లకు సరిపడా మెటీరియల్ ప్రాజెక్టు ప్రాంతంలో సిద్ధంగా ఉందని తెలిపారు. ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు దిగువ కాఫర్ డ్యామ్‌కు సమీపంలో రామయ్యపేట ప్రాంతంలో రెండు చోట్ల రెండేసి చొప్పున నాలుగు ప్లాంట్లు ఇప్పటికే సిద్ధం చేశామని తెలిపారు. మరో ప్లాంటు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటులో డయాఫ్రంవాల్ నిర్మాణానికి ఉపయోగించే ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ జరుగుతోందని తెలిపారు. ఒక్కో ప్లాంటు ద్వారా 240 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ సరఫరా అవుతుందని, నాలుగు ప్లాంట్ల ద్వారా 960 క్యూబిక్ మీటర్ల ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సింగ్ సిద్ధం చేశామని తెలిపారు. ట్రెంచ్ కట్టర్ జర్మనీ నుండి దిగుమతి చేసిన భారీ యంత్రం ద్వారా నదీ గర్భంలో రాతిపొరలు తగిలే వరకూ డయాఫ్రం వాల్ నిర్మాణపు ప్రాంతంలో నిర్మించిన కాంక్రీట్ గైడ్ వాల్ మధ్య తవ్వకాలు చేస్తామని చెప్పారు. ఈ యంత్రానికి అడుగు భాగాన ఉన్న భారీ కట్టర్లు భూమి అంతర్భాగంలోకి వేగవంతంగా చొచ్చుకుపోయేలా పని చేస్తాయని తెలిపారు. ట్రెంచ్ కట్టర్లకు అమర్చిన భారీ పైపుల ద్వారా బెంజోనేట్ పౌడరు కలిపిన జలాలను ట్రెంచ్ కట్టర్ పైపుల ద్వారా నదీ గర్భంలో ఉన్న మట్టి ఇసుక తవ్వకాల ప్రాంతంలో నిరంతర ప్రవాహం చేయడం వలన భూమి పొరల్లో ఇసుక ప్రాంతంలో తవ్వకాలు జరిపిన క్రమంలో ఇసుక పొరలు నలు వైపుల నుండి తవ్వకాలలోకి జారకుండా బెంటోనైట్ గట్టిపరుస్తుందన్నారు. తద్వారా తవ్వకం పనులు సులభతరమవుతాయని వివరించారు. డయాఫ్రంవాల్ నిర్మాణంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా తవ్వకాలు జరుగుతాయని, గరిష్టంగా 30 మీటర్ల నుంచి కనిష్టంగా 40 మీటర్ల వరకూ ట్రెంచ్ కట్టర్ ద్వారా తవ్వకాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ ఇఇ వెంకటేశ్వరరావు, బావర్ కంపెనీ ఇంజనీర్ హసన్, మెగా ఇంజనీరింగ్ కంపెనీ జిఎం.అంగర సతీష్ పాల్గొన్నారు.



బావర్ యంత్రంతో పనులు మొదలుపెడుతున్న అధికారులు



పురస్కారం అందుకుంటున్న అందెశ్రీ

అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దిన్‌లకు లోక్‌నాయక్ పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

లోక్‌నాయక్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం విశాఖపట్నంలోని సిరిపురంలోని బిఆర్ అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, మాజీ ఎంపి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, గౌరవ అతిథిగా సినీ నటుడు బ్రహ్మానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్ తెలుగు సినీ పరిశ్రమకు రెండు కళ్లు వంటివారన్నారు. అనంతరం సాహితీవేత్తలు అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దిన్‌లకు లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం అందజేసి సత్కరించారు. స్వర్ణ భారతి ట్రస్ట్‌కు చెందిన ఇమ్మణ్ణి దీపా వెంకట్, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం తరపున హాజరైన శాస్త్రికి, ప్రముఖ వైద్యులు, నటులు, సినీ నిర్మాత పోలిచర్ల హరినాథ్‌కు జీవన సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్‌టి.రామారావు పిఎ మోహన్, డ్రైవర్ లక్ష్మణ్, పలువురిని సత్కరించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చలనచిత్ర నిర్మాత అశ్వినీదత్, దర్శకులు వైవిఎస్.చౌదరి, అమెరికాకు చెందిన క్వాలిటీ మ్యాక్స్ గ్రూప్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్, విజ్ఞాన్ లావు రాణి రుద్రమదేవి పాల్గొన్నారు.

నేటి నుంచి సిఎం దావోస్ పర్యటన

- నాలుగు రోజుల పాటు పర్యటన
- మిట్టల్‌తో ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనకు ఆదివారం వెళ్లనున్నారు. అక్కడ జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు ఆయన హాజరు అవుతారు. సిఎం కార్యాలయం తెలిసిన సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లి, అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తన బృందంతో కలిసి జ్యూరిచ్‌కు చేరుకుంటారు. అక్కడ ఇండియన్ అంబాసిడర్‌తో భేటీ అవుతారు. అనంతరం హిల్టన్ హోటల్‌లో 10 మంది పారిశ్రామిక వేత్తలతో సమావేశం కానున్నారు. అక్కడి నుంచి హోటల్ హయత్‌లో తెలుగు పారిశ్రామిక వేత్తలతో కలిసి సమావేశంలో పాల్గొంటారు. మీట్ అండ్ గ్రీట్ విత్ తెలుగు డయాస్పోరా పేరుతో నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులపై, ఎపిని ప్రమోట్ చేయడం, పెట్టుబడులకు వారిని ఆహ్వానించడంపై సమావేశంలో చర్చిస్తారు. అక్కడ నుంచి దావోస్ చేరుకొని రాత్రి పలువురు పారిశ్రామిక వేత్తలతో డిన్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు.

తరువాత అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీమిట్టల్‌తో ప్రత్యేకంగా సమావేశమవుతారు. తొలి రోజు సమావేశాలు ముగించుకుని హోటల్‌కు చేరుకుంటారు. రెండవ రోజు సిఐఐ సెషన్స్‌లో గ్రీన్ హైడ్రోజన్ అంశంపై చర్చల్లో పాల్గొంటారు. అనంతరం సోలార్ ఇంపల్స్, కోకకోలా, వెల్‌స్పన్, ఎల్‌జి, కార్ల్స్ బర్గ్, సిస్కో, వాల్ మార్ట్ ఇంటర్ నేషనల్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్, వంటి సంస్థల సిఇఒలతో, ఛైర్మన్‌లతో సమావేశం అవుతారు. అదేవిధంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహిస్తున్న పలు అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొంటారు. బూమ్ బర్గ్ వంటి మీడియా సంస్థలకు ఇచ్చే ఇంటర్వ్యూల్లో ఎపి ప్రభుత్వ పాలసీలను వివరిస్తారు. మూడవ రోజు పలువురు బిజినెస్ టైకూన్లతో సమావేశం అవుతారు. నాల్గవ రోజు ఉదయం దావోస్ నుంచి జ్యూరిచ్‌కు చేరుకుని అక్కడి నుంచి స్వదేశానికి రానున్నారు. సిఎం బృందంలో పరిశ్రమల శాఖ మంత్రి టి.బి భరత్, ఐటి మంత్రి నారా లోకేష్‌తోపాటు పరిశ్రమల ఉన్నతాధికారులు, తదితరులు ఉన్నారు.

ప్యాకేజి ప్రకటన కంటి తుడుపు చర్య

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం కేటాయించిన ఆర్థిక ప్యాకేజి కంటి తుడుపు చర్య మాత్రమేనని, దీంతో కర్మాగారానికి పూర్తిస్థాయి న్యాయం జరగబోదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1437వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు, ఉద్యోగులు కూర్చున్నారు.

వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు అప్పారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఇప్పటికే రూ.8 వేల కోట్ల ఓవర్ డ్రాఫ్ట్‌లో ఉందని తెలిపారు. ఇచ్చిన ప్యాకేజి నిధుల్లో బ్యాంకుల అప్పులు, జిఎస్‌టి చెల్లింపులు చేస్తే మిగిలిన కొద్ది డబ్బులతో స్టీల్‌ప్లాంట్ కష్టాలు ఎలా తీరుతాయని ప్రశ్నించారు. పిఎఫ్, థ్రిఫ్ట్, డెత్ ఫండ్ చెల్లింపులను కొంత కాలంగా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేయడంలేదన్నారు. వీటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆ సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్యాకేజి తాత్కాలిక ఉపశమనమే..

- స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలి
- నేడు మహాధర్నా : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజి వల్ల తాత్కాలిక ఉపశమనం మాత్రమే కలుగుతుందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు అన్నారు. తక్షణమే ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, బి.పద్మ, వి.కృష్ణారావులతో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఆర్థిక ప్యాకేజి ప్రకటించడం మంచిదేనని, ఆ మేరకు నిధులు మంజూరు చేయడం గత నాలుగు సంవత్సరాలుగా విశాఖ ఉక్కు కార్మికులు, వివిధ తరగతుల ప్రజలు, సిపిఎం, వామపక్ష పార్టీల సమైక్య పోరాట ఫలితమని తెలిపారు. గతంలో రూ.1650 కోట్లను ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్రం ప్యాకేజీ కింద ఇచ్చినట్లే ఇచ్చి జిఎస్‌టి బకాయిల పేరుతో తిరిగి లాగేసుకుందని గుర్తు చేశారు. ఈ ప్యాకేజి అలా కాకుండా విశాఖ ఉక్కు ఉత్పత్తికి, ఉత్పత్తి కారకులైన కార్మికవర్గం అభివృద్ధికి ప్రతి రూపాయి వినియోగించాలని కోరారు. ఈ ప్యాకేజి శాశ్వత పరిష్కారం కాదన్నారు. ప్లాంట్‌కు పూర్వవైభవం రావాలంటే కర్మాగారాన్ని స్ట్రాటజిక్ సేల్ పేరుతో అమ్మాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌తో సహా ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని కోరారు. బదిలీలు, విఆర్‌ఎస్ పేరుతో ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికులను, మెడికల్, టెండర్ల పేరుతో కాంట్రాక్ట్ కార్మికులను వేల సంఖ్యలో తొలగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో ఐదు వేల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. మోడీ ప్రభుత్వంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఉక్కు రక్షణ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రకటన వచ్చే వరకు ఉక్కు కార్మికులు, విశాఖ ప్రజలు తమ పోరాటాన్ని ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఉత్పత్తే ప్రారంభం కాని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, దానికి కావాల్సిన అనుమతులన్నీ త్వరితగతిన ఇవ్వాలని చంద్రబాబు ప్రధానితో మాట్లాడారన్నారు. కానీ విశాఖ ఉక్కుకు గనుల కోసం మాత్రం మాట్లాడటం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు లేక ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి రూ.4 వేలు అదనపు భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా చేపడుతున్నామని, జయప్రదం చేయాలని కోరారు.

గురుకుల విద్యాలయాల్లో సమస్యలు

- పరిష్కరించాలని ముఖ్యమంత్రికి కెవిపిఎస్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గురుకుల విద్యాలయాల్లోని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కెవిపిఎస్ కోరింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు సంఘం ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి శనివారం లేఖ రాశారు. రాష్ట్రంలో 190 గురుకుల రెసిడెన్సీ విద్యాలయాల్లో 1.05 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇందులో వైద్యారోగ్య సేవలు కోసం 190 మంది స్టాఫ్ నర్సులను, అందులో 15 మంది క్వాలిఫైడ్ ఆయుష్ వైద్యులను హెల్త్ సూపర్‌వైజర్‌లుగా కేటాయించారని పేర్కొన్నారు. గతంలో 400 మంది విద్యార్థులకు ఒక స్టాఫ్ నర్సును కేటాయించారని, ఇప్పుడు 720 నుంచి 900 వరకు పెరిగిందని తెలిపారు. స్కూల్, వసతి గృహాల నందు ఆరోగ్యానికి సంబంధించి చాలా సమస్యలను విద్యార్థులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తమ సంఘం కార్యకర్తలు ప్రత్యక్షంగా వారితో, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడిన సందర్భంలో చూశారని తెలిపారు. వైద్యారోగ్య సేవలపై పరిశీలన చేయాలని కోరారు. అర్హత ఉన్న వైద్యులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అదనపు స్టాఫ్ నర్సులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. అనారోగ్య కారణాల వల్ల విద్యార్థులకు ఎక్కువ మందికి హాజరుశాతం తక్కువగా ఉంటుందని, తల్లిదండ్రుల అవగాహన లోపం వల్ల అనేక ఆర్థిక, సామాజిక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఆర్థిక, అక్షరాస్యత విషయంలో తగు చర్యలు తీసుకుని సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఆదిత్య 'వర్సిటీ' పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

తమ యూనివర్సిటీకి సంబంధించి 2024-25 నుంచి 2026-27 సంవత్సరాలకు ఎపి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఎపిహెచ్‌ఆర్‌ఎంసి) ఖరారు చేసిన ట్యూషన్ ఫీజును, దానిని నోటిఫై చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఓ 19ను సవాల్ చేస్తూ ఆదిత్య యూనివర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. కొత్తగా కాలేజీ నుంచి యూనివర్సిటీగా మారిన నేపథ్యంలో ఫీజుల ఖరారుకు ఆధారమైన నిర్దిష్ట సమాచారం ఏదీ లేనందున, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగానే ఫీజును ఖరారు చేశామన్న కమిషన్ వాదనను హైకోర్టు సమర్థించింది. ఇప్పటికే నిర్దిష్ట సంవత్సరాలకు ఫీజు ఖరారు చేసిన నేపథ్యంలో ఆ ఫీజు విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమంది. ఈ మేరకు జస్టిస్ తర్లాడ రాజశేఖర్ తీర్పు వెలువరించారు.



పుంగనూరు ఆవు, దూడలతో సాయి

19 అంగుళాల పుంగనూరు దూడ జననం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో పుంగనూరు జాతికి చెందిన ఆవుకు 19 అంగుళాల దూడ జన్మించింది. మూగజీవాలపై ఉన్న మక్కువతో స్థానిక అగ్రహారానికి చెందిన తాడాల సాయి శ్రీనివాస్ మూడేళ్ల నుంచి తన ఇంట్లో పుంగనూరు ఆవును పెంచుకుంటున్నారు. 19 అంగుళాల దూడకు శనివారం ఆవు జన్మనిచ్చింది. ఈ దూడ అతి చిన్నగా ఉండడంతో చూసేందుకు చుట్టుపక్కల వారు తరలివస్తున్నారు.

దళారులను నమ్మొద్దు

- సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమగ్రశిక్షా ఆధ్వర్యాన వృత్తి విద్యా కోర్సు అమలు కోసం బోధకులు (ఒకేషనల్ ట్రైనర్లు) నియామకాలు థర్డ్ పార్టీ ఏజెన్సీలైన ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ నిర్వహిస్తున్నారని సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నియామకాల కోసం దళారులకు అభ్యర్థులు డబ్బులిచ్చి మోసపోవద్దని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ పోస్టులకు పూర్తిగా ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ నిర్వహణలో, పరిమితకాలం మాత్రమే ఉంటాయని అన్నారు. ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్ ఏజెన్సీలకు, ఒకేషనల్ ట్రైనర్లకు మధ్య ఒప్పందం ఉంటుందని పేర్కొన్నారు. వృత్తి విద్యా కోర్సు బోధకులకు సమగ్రశిక్షాతో ఎలాంటి సంబంధం ఉండదని వివరించారు. ఈ నియామకాలు ప్రతిభ ఆధారంగా, పారదర్శకతగా ఉండాలనే ఉద్దేశంతో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థుల నుంచి ఎలాంటి డబ్బులు వసూలు చేయకూడదని ఒకేషనల్ ట్రైనింగ్ పార్టనర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని వివరించారు.

సకాలంలో న్యాయ సేవలే ప్రథమ కర్తవ్యం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

న్యాయం కోసం తమ వద్దకు వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించడమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు. విశాఖలోని ఎయు కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులపాటు జరగనున్న సౌత్ జోన్ - 2 రీజనల్ జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు సకాలంలో న్యాయం అందించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అయితే, పలు కారణాల వల్ల వారు కొన్నిసార్లు న్యాయం కోసం సంవత్సరాల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సకాలంలో న్యాయం అందించి కక్షిదారులకు ఆనందం కలిగించడంలో తాము నిత్యం సవాళ్లను ఎదుర్కొంటున్నామని, వాటిని అధిగమించడానికి ప్రయత్నిస్తూనే ఉంటామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారిత సేవలతో తమ సామర్థ్యం కొంత మేర మెరుగుపడుతోందన్నారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ అనిరుధ్ బోస్ మాట్లాడుతూ.. దేశంలోని వివిధ న్యాయస్థానాల్లో లెక్కకు మిక్కిలిగా వ్యాజ్యాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇంతవరకు దేశ వ్యాప్తంగా 4.5 కోట్ల వ్యాజ్యాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత సంవత్సరం దేశ వ్యాప్తంగా 37 లక్షల వ్యాజ్యాలు నమోదవ్వగా.. 38 లక్షల వ్యాజ్యాల తీర్పులు వెలువడ్డాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో న్యాయ సేవలను సమర్థంగా అందించడానికి ప్రయత్నించాలని సూచించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నరసింహ మాట్లాడుతూ గతంలో నియమించిన లా కమిషన్ చట్టబద్ధంగా పని చేయలేకపోవడంతో జ్యుడీషియల్ అకాడమీని నియమించారని తెలిపారు. ఈ జ్యుడీషియల్ అకాడమీ జడ్జిలు, అకడమిక్ లా పర్సన్స్, లాయర్ల నియామకంలో సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. 2011లో ఒక అడ్వర్‌టైజింగ్ సంస్థకు సంబంధించిన కేసు కోర్టుకు వస్తే దాని తీర్పు 2024లో వచ్చిందన్నారు. అదే విధంగా కోర్టుకు వచ్చిన అన్నదమ్ముల ఆస్తి తగాదాల తీర్పులు 25 సంవత్సరాల తరువాత వస్తున్నాయన్నారు. ఈ విధానం మారాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్.రామచంద్రరావు, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.నరేంద్ర, పలువురు జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

నిరుపేదల ఇళ్ల స్థలాలు లాక్కుంటున్నారు

- వైసిపి అధికార ప్రతినిధి సుధాకరబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిరుపేదల ఇళ్ల స్థలాలను కూటమి ప్రభుత్వం లాక్కుంటోందని వైసిపి అధికార ప్రతినిధి, ఎస్‌సి సెల్ మాజీ అధ్యక్షులు టిజెఆర్ సుధాకరబాబు ఆరోపించారు. వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ఏ హక్కుతో పట్టాలను రద్దు చేస్తున్నారో చెప్పాలన్నారు. గతంలో ఇచ్చిన పట్టాలను వెనక్కు తీసుకుని టిడిపి కార్యకర్తలకు పంచిపెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

సిఎం చంద్రబాబు ఏనాడూ పేదలకు భూమి పంచలేదని, జగనన్న కాలనీలతో రూ.1.50 లక్షల కోట్ల సంపదను సృష్టించామని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా 30.06 లక్షల మందికి 71,811 ఎకరాలను ఇళ్ల స్థలాల కోసం ఇచ్చారని తెలిపారు. రూ.15,364 కోట్లు వెచ్చించి 25,374 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. అమరావతి మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ఏరియా నుండి 1,074.18 ఎకరాలు రూ.966.76 కోట్లు, టిడ్కో భూములు 2,550.96 ఎకరాలు రూ.2,295.86 కోట్లకు కొనుగోలు చేశామని, ఇవన్నీ కలిపితే రూ.56,102 కోట్ల విలువైన ఆస్తిని పేదల చేతుల్లో జగన్ పెట్టారన్నారు.

ఎన్‌టిఆర్‌కు భారతరత్న వస్తుంది : లోకేష్



ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న లోకేష్, భువనేశ్వరి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు భారత అత్యున్నత పురస్కారం భారతరత్న తప్పకుండా వస్తుందని ఎన్‌టిఆర్ మనవడు, ఎపి మంత్రి నారా లోకేష్ అన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద తల్లి భువనేశ్వరితో కలిసి లోకేష్ నివాళులర్పించారు. సినీ, రాజకీయ రంగానికి ఎన్‌టిఆర్ చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. లోకేష్ మాట్లాడుతూ..ఎన్‌టిఆర్ ప్రభంజనం టిడిపిని అధికారంలోకి తీసుకొచ్చిందన్నారు. సిఎంగా అనేక పరిపాలనా సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. టిడిపిలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు.ఎన్‌టిఆర్ ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని పరిశీలించిన లోకేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనుమతులు తీసుకొని త్వరలోనే తమ నిధులతో ఘాట్ మరమ్మతులు చేపడుతామన్నారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్‌టిఆర్ ట్రస్ట్‌కు అప్పగించాలని గత తెలంగాణ ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశామని లోకేష్ తెలిపారు. ఎన్‌టిఆర్ కుటుంబ సభ్యులు నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, జూనియర్ ఎన్‌టిఆర్, కల్యాణ్‌రామ్ తదితరులు నివాళులర్పించారు.



మాట్లాడుతున్న సాయిబాబు

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- బాలానందన్ శతజయంతి సభలో సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు పూర్వ జాతీయ అధ్యక్షులు బాలానందన్ స్ఫూర్తితో పోరాడాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు కోరారు. ఐదు రోజులపాటు గుంటూరులో జరిగే సిఐటియు రాష్ట్ర వర్క్‌షాప్ ప్రారంభం సందర్భంగా గుంటూరులోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో బాలానందన్ శతజయంతి సభ శనివారం నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సాయిబాబు మాట్లాడుతూ.. సాధారణ డైలీవేజ్ కార్మికుడిగా జీవితం ప్రారంభించి సిఐటియు అఖిల భారత అధ్యక్షులుగా, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ అనుబంధ ఎనర్జీ, గనుల అంతర్జాతీయ సంఘానికి అధ్యక్షులుగా పని చేసిన ఇ.బాలానందన్ అసాధారణ జీవిత ప్రస్థానం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. కేరళ రాష్ట్రం కొల్లం జిల్లాలో జన్మించారని, విద్యాభ్యాసం కొనసాగించలేక షాపుల్లో రోజువారీ కూలీగా పని చేశారని తెలిపారు. కొల్లం జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడిగా జీవితాన్ని ప్రారంభించి రెండుసార్లు అసెంబ్లీకి, రెండుసార్లు రాజ్యసభకు, మరోసారి లోక్‌సభకు కేరళ నుంచి ఎన్నికయ్యారన్నారు. సిఐటియు కేరళ రాష్ట్ర కార్యదర్శిగానూ, 1990 నుండి 2002 వరకు అఖిల భారత అధ్యక్షులుగానూ పనిచేశారన్నారు. విద్యుత్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆయన నాయకత్వంలోనే ఆవిర్భవించిందని, అదే సంఘం నేడు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు నాయకత్వం వహిస్తుందని వివరించారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. ఛండీఘర్‌లో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూ విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుంటున్న విద్యుత్ సంఘం స్థాపనకు నాడు పునాది వేసింది బాలానందన్ అని అన్నారు. న్యూపెన్షన్ స్కీమ్, ఆర్థిక సంస్కరణల ప్రారంభంలో ప్రమాదాన్ని గుర్తించి తెలియజేయడంలో, పార్లమెంట్‌లో, వాటికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బాలానందన్ కీలక పాత్ర పోషించారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజి ప్రకటించటాన్ని స్వాగతిస్తున్నామని, ప్యాకేజి పోరాట ఫలితమే అన్నారు. అయితే సొంత గనులు కేటాయించి, సెయిల్‌లో విలీనం చేయటమే శాశ్వత పరిష్కారమని తెలిపారు. సభలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు బేబిరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు కె.సుబ్బరావమ్మ, కె.ఉమామహేశ్వరరావు, ఆర్.వి.నరసింహారావు, ముజఫర్ అహ్మద్, దయాదేవి, ఓబులు, కుమార్, నాగరాజు, అంజిబాబు, రాజారామ్మోహన్‌రాయ్, డిఎన్‌విడి ప్రసాద్, జి.కోటేశ్వరరావు, తేజ, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మీనారాయణ, వై.నేతాజి తదితరులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ లంబార్డ్ లాభాల్లో 68 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఐసిఐసిఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 68 శాతం వృద్ధితో రూ.724.38 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.431.46 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.5,883 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ3లో 17 శాతం పెరిగి రూ.5,883 కోట్లకు చేరింది.

ఘనంగా సాయుధ దళాల వెటరన్స్ డే



విశాఖ తీరంలో సాగుతున్న వెటరన్స్ డే పెరేడ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (ఎంవిపి.కాలనీ)

తూర్పు నావికాదళ కమాండ్ ఆధ్వర్యంలో 9వ సాయుధ దళాల వెటరన్స్ డే శనివారం ఘనంగా జరిగింది. విశాఖ బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు వెటరన్స్ డే పెరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తూర్పు నావికాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్, నేవీ ఫౌండేషన్ అధ్యక్షులు, వైస్ అడ్మిరల్ (రిటైర్డ్) వికె.నంబల్ల, వెటరన్ సెయిలర్స్ ఫోరం గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు, నేవీ మాస్టర్ చీఫ్ పెట్టీ ఆఫీసర్ (రిటైర్డ్) డాక్టర్ పి.చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ.. తూర్పు నావికాదళం చేపట్టిన ఈ పెరేడ్ దేశ వీరుల వారసత్వాన్ని గౌరవించడంతోపాటు సాయుధ దళాల్లో పని చేస్తున్న, ఉద్యోగ విరమణ చేసిన సభ్యుల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను పరిరక్షించడానికి జీవితాలను అంకితం చేసిన వారిని మరొకసారి గౌరవించుకోవడానికి అవకాశం కల్పిస్తుందని వివరించారు. వారికి ఇండియన్ నేవీ తరుపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి త్రివిధ దళాలకు సంబంధించిన హెల్ప్ డెస్క్‌లు ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. వీటితోపాటు స్పర్శ (సిస్టం ఫర్ పెన్షన్ అడ్మినిస్ట్రేషన్), ఎక్స్ సర్వీసెస్ కంట్రిబ్యూటర్ హెల్త్ స్కీమ్ (ఇసిహెచ్‌ఎస్), ప్రముఖ బ్యాంకుల ప్రతినిధుల ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారానికి పలు స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా లీ ఫార్మా స్వచ్ఛంద సంస్థ బోన్ అండ్ జాయింట్ హెల్త్ క్యాంపు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 500 మందికిపైగా త్రివిధ దళాల వెటరన్ సభ్యులు, ఫ్లాగ్ ఆఫీసర్లు, ఇఎన్‌సి సిబ్బంది, కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థులు, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

టెల్కోలకు బంపర్ లబ్ధి..!

- రూ.1 లక్ష కోట్ల ఎజిఆర్ బకాయిల మాఫీ
- యోచనలో కేంద్రం
- విఐ, భారతీ ఎయిర్‌టెల్‌లకు మద్దతు



న్యూఢిల్లీ : ప్రయివేటు టెలికం కంపెనీలకు భారీ లబ్ధి చేకూర్చడానికి మోడీ సర్కార్ కసరత్తు చేస్తోందని సమాచారం. టెల్కోలను ఆదుకునే పేరుతో స్థూల సర్దుబాటు ఆదాయం (ఎజిఆర్) బకాయిలను మాఫీ చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని రిపోర్టులు వస్తోన్నాయి. దీంతో టెలికాం కంపెనీలకు దాదాపు రూ.1 లక్ష కోట్ల మేర లబ్ధి చేకూరనుందని సమాచారం. గతంలో దక్కించుకున్న స్పెక్ట్రమ్‌కు గానూ బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను ఇప్పటికే కేంద్రం తొలగించింది. మరోమారు టెల్కోలకు భారీ ఆర్థిక మద్దతును ఇవ్వనుందని.. ఇందుకోసం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనుందని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ వంటి సంస్థలకు మేలు చేకూరనుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. టెలికం కంపెనీల డిపాజిట్లపై వడ్డీ, ఆస్తుల విక్రయాలు, డివిడెండ్‌లు సహా అన్ని రకాల ఆదాయాలపై పన్నులు చెల్లించాల్సి ఉండగా.. పలు కారణాలు, భారాల పేరుతో టెల్కోలు ఇందులో కొన్ని బకాయిలను చెల్లించలేదు. ఆ విధంగా కేంద్రానికి రూ.1.47 లక్షల కోట్ల మేర చెల్లించాల్సి ఉంది.

ఎజిఆర్ బకాయిలకు సంబంధించిన చర్చలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. గతేడాది మార్చి నాటికి వొడాఫోన్ ఐడియా బకాయిలు రూ.80వేల కోట్లకు చేరగా.. ఎయిర్‌టెల్ బకాయిలు రూ.42వేల కోట్లుగా ఉన్నాయని అంచనా. ఇందులో దాదాపు 75 శాతం మేర వడ్డీ ఉండగా మిగిలినది జరిమానాలు ఉన్నాయి. ఈ బకాయిలపై ఇప్పటికే టెలికాం కంపెనీల ప్రతినిధులతో టెలికాం విభాగం పలుమార్లు సమావేశమైంది. ఆర్థికంగా తాము ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని ఆ కంపెనీలు ప్రభుత్వానికి తెలిపాయి. ఈనేపథ్యంలోనే వడ్డీపై 50శాతంతో పాటు పెనాల్టీలు, పెనాల్టీలపై విధించిన వడ్డీని 100 శాతం మేర మాఫీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని సమాచారం. అదే జరిగితే విఐకి రూ.52 వేల కోట్లు, ఎయిర్‌టెల్‌కు రూ.38వేల కోట్లు, టాటా టెలీ సర్వీసెస్‌కు రూ.14వేల కోట్ల మేర బకాయిలు రద్దు కానున్నాయి.

భారీ వృద్ధి లెక్కలు అప్పుల కోసమేనా...?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పెద్ద ఎత్తున అప్పులు తీసుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం వృద్ధి లెక్కలను భారీగా పెంచి చూపుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్చి నుంచి ప్రారంభంకానున్న 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి 2029-30 ఆర్థిక సంవత్సరం వరకు జిఎస్‌డిపిని ఆర్థిక, ప్రణాళిక శాఖలు సంయుక్తంగా అంచనా వేశాయి.

15 శాతం వృద్ధితో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 18.47 లక్షల కోట్ల జిఎస్‌డిపి నమోదవుతుందన్నది ఈ శాఖల నిర్ధారణ. అలాగే 2029-30 ఆర్థిక సంవత్సరానికి జిఎస్‌డిపి 32.30 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రతి సంవత్సరం ఒకే తరహాలో 15 శాతం వృద్ధి నమోదవుతుందని పేర్కొనడం గమనార్హం. ఇందులో ఇప్పుడున్న నిబంధనల మేరకు 3.5 శాతంగా రుణాన్ని తీసుకుంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో 64,646 కోట్లు రుణానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ రుణం పెరుగుతూ 2029-30 సంవత్సరంలో 1,13,066 కోట్లుకు చేరుతుందని అంచనా. ఐదేళ్లలో మొత్తం జిఎస్‌డిపిలో 3.5 శాతం చొప్పున 4,35,867 కోట్లకు రుణం చేరుకుంటుందని చెబుతున్నారు. భారీ స్థాయిలో ఈ రుణం సేకరించేందుకే జిఎస్‌డిపి లెక్కలను పెంచి చూపుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సొంత ఆదాయం ఇలా...

ఇక వచ్చే ఐదేళ్లలో సమకూరే సొంత ఆదాయంపైనా భారీగానే అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఏటా 6.5 శాతం వృద్ధిని గణిస్తూ 2029-30 నాటికి 2.09 లక్షల కోట్లు సొంత ఆదాయం సమకూరుతుందని లెక్కించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1.20 లక్షల కోట్లుగా ఆదాయం ఉంటుందని అంచనా. ఈ ఐదేళ్ల కాలానికి సొంత ఆదాయంగా 8,09,465 కోట్లు వస్తుందని భావిస్తున్నారు.

అలాగే రుణాలు, సొంత ఆదాయం కలిపి మొత్తం 2029-30 నాటికి 12.45 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. జిఎస్‌డిపి వృద్ధిని 15 శాతంగా గణించిన ప్రభుత్వం సొంత ఆదాయాన్ని మాత్రం కేవలం 6.5 శాతంగా లెక్కించడం గమనార్హం.

అంచనాలు ఇలా...!

సంవత్సరం	జిఎస్‌డిపి (లక్షల కోట్లలో)	రుణం (రూ.కోట్లలో)	సొంత ఆదాయం (రూ.కోట్లలో)	మొత్తం (రూ.కోట్లలో)
2025-26	18.47	64,646	1,20,056	1,84,703
2026-27	21.24	74,343	1,38,065	2,12,408
2027-28	24.42	85,494	1,58,774	2,44,269
2028-29	28.09	98,318	1,82,591	2,80,909
2029-30	32.30	1,13,066	2,09,979	3,23,046
మొత్తం	**124.52**	**4,35,867**	**8,09,465**	**12,45,332**



కళ్లు చెదిరే మినీ కూపర్ విడుదల

న్యూఢిల్లీ : బ్రిటిష్‌కు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ మినీ తన మినీ కూపర్ ఎస్ జెసిడబ్ల్యు ప్యాక్‌ను విడుదల చేసింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ లగ్జరీ కారు ధరను రూ.55.90 లక్షలుగా నిర్ణయించినట్లు మినీ ఇండియా వెల్లడించింది. ఈ కారు బుకింగ్స్‌కు తెరిచామని.. ఏప్రిల్ నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు గంటకు గరిష్టంగా 242 కిలోమీటర్లు ప్రయాణించగలదు.


వేవ్ మొబిలిటీ సోలార్ కార్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల తయారీ సంస్థ వేవ్ మొబిలిటీ కొత్తగా సోలార్‌తో నడిచే ఎలక్ట్రిక్ వాహనం ఇవిఎను ఆవిష్కరించింది. శనివారం దీన్ని ఆటోమొబైల్ ఎక్స్‌పోలో విడుదల చేసింది. మూడు వేరియంట్లలో లభ్యం కానున్న దీని ధరల శ్రేణిని రూ.3.25 లక్షల నుంచి రూ.6 లక్షలుగా ఉండొచ్చని అంచనా. 2026లో దీని ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది.

వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఎంపిక చేసిన నగరాల్లో తొలుత వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామని వేవ్ మొబిలిటీ సిఇఒ విలాస్ దేశ్‌పాండే తెలిపారు. సగటున ప్రతి రోజూ 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. విద్యుత్ ఛార్జింగ్‌తో కూడా 250 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.

ఇన్ఫోసిస్ మూర్తి కుటుంబ సంపద రూ.1900 కోట్లు ఫట్



ముంబయి : వారాంతం సెషన్‌లో ఇన్ఫోసిస్ షేర్ విలువ భారీగా పడిపోవడంతో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి కుటుంబం సంపద వేల కోట్లు ఆవిరయ్యింది. శుక్రవారం సెషన్‌లో అమ్మకాల ఒత్తిడితో ఇన్ఫీ షేర్ 6 శాతం పతనమై రూ.1,812.70కు పడిపోయింది. దీంతో బిఎస్ఇలో ఒక్క పూటలోనే మూర్తి కుటుంబ సంపద దాదాపు రూ.1,900 కోట్లు హరించుకుపోయింది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.54 లక్షల కోట్లకు పడిపోయింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి నారాయణ మూర్తి కుటుంబానికి సమిష్టిగా 4.02 శాతం వాటా ఉంది. ఇందులో మూర్తికి 0.40 శాతం, ఆయన సతీమణి సుధా మూర్తికి 0.92 శాతం, వారి కుమారుడు రోహన్ మూర్తికి 1.62 శాతం, కుమార్తె, రిషి సునక్ భార్య అక్షతా మూర్తికి 1.04 శాతం, మనవడు ఏకగ్రహ రోహన్ మూర్తికి 0.04 శాతం చొప్పున వాటాలున్నాయి. మొత్తంగా వీరి హోల్డింగ్ వాటా విలువ రూ.30,334 కోట్లుగా ఉంది.

బిఎండబ్ల్యు కొత్త ఎస్1000 ఆర్ఆర్ బైక్ ఆవిష్కరణ

- ధర రూ.21.10 లక్షలు

న్యూఢిల్లీ : బిఎండబ్ల్యు మోటోరాడ్ కొత్తగా మరో లగ్జరీ బైక్ ఎస్1000 ఆర్ఆర్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.21.10 లక్షలుగా నిర్ణయించింది. ఈ బైకు కోసం బుకింగ్స్‌ను తెరిచినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఏప్రిల్ 2025 నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. 999 సిసి ఇన్‌లైన్ ఫోర్ సిలిండర్ ఇంజిన్, 210 హెచ్‌పి పవర్ కలిగి ఉంది. 3.3 సెకండ్లలోనే 0-100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదని.. గంటకు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని ఆ కంపెనీ తెలిపింది.



సంపాదకీయం


కార్చిచ్చు

కాలిఫోర్నియా గాలిలో బలంగా వ్యాపిస్తోన్న ఘాటైన కవురు వాసన. అంతులేని కార్చిచ్చుల వల్ల పెరుగుతున్న ఆందోళన... కేవలం క్షణికమైన విపత్తు కాదు. భవిష్యత్‌ను కలవరపెట్టే అంశం. కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో ప్రకృతి దృశ్యం మండుతున్న నారింజ, బూడిద రంగులతో కూడిన భయంకరమైన వస్త్రం కప్పినట్లుగా కనిపిస్తోంది. ఇళ్లు పొగమంచు శిథిలాలుగా మారాయి. పర్యావరణం నాశనమైంది. ఆర్థిక నష్టం, నిరాశ్రయ కుటుంబాల భావోద్వేగం వారి జీవితాలను మార్చలేనంతగా కమ్మేసింది. గత కొన్ని దశాబ్దాలుగా కార్చిచ్చులు, భూకంపాలు వంటి విపత్తులకు మానవులు కూడా సమాన బాధ్యులే. లాస్ ఏంజెల్స్‌లో రగిలిన కార్చిచ్చు... చెట్టు పుట్టను కబళించడమే కాదు, ఈ ప్రాంతంలోని అత్యంత ఖరీదైన ఇళ్లను బూడిద కుప్పలుగా మార్చింది. 16 మంది మృతి చెందగా, 70 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్చిచ్చు మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశం ఉందని, వ్యాధి నిరోధక శక్తిపై దాడి చేయడమే కాకుండా శ్వాస సంబంధ వ్యాధులను, ఇన్ఫెక్షన్లను వ్యాప్తి చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో సంభవించిన కార్చిచ్చు ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. శాస్త్రవేత్తలను సైతం నిర్ఘాంతపరుస్తోంది. మంటలు ఇంత వేగంగా వ్యాపించడం మునుపెన్నడూ చూడలేదని, వాతావరణ పరిస్థితులే దీనికి కారణమని అగ్నిమాపకాధికారులు చెబుతున్నారు. మానవ తప్పిదాల వల్ల ముమ్ముందు ఇలాంటి విపత్తుల ముప్పు మరింత పెరుగుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఈ కార్చిచ్చు ఒక్క అమెరికాకే పరిమితమైంది కాదు. నేడు ప్రపంచమంతా ఈ ముప్పు ముంగిట వుంది' అని తేల్చి చెబుతున్నారు. భారత్‌లోనూ కార్చిచ్చుల బెడద క్రమంగా పెరుగుతోంది. హిమాలయాల జీవవైవిధ్యానికి అడవీ మంటలు ముప్పుగా పరిణమిస్తాయని ఆందోళన చెందుతోంది. ఉత్తర భారతంలోని అడవుల్లో ఇటీవల పెరుగుతున్న అగ్నిప్రమాదాలే దీనికి కారణం. 36 శాతం మేరకు అడవులు దావాలనాల బారిన పడుతున్నాయి. చిత్తడి ప్రాంతాల్లోనూ వాటి విజృంభణ సర్వసాధారణమైంది. ఈ ఏడాది తొలిరోజునే కులులోని తాండి గ్రామాన్ని భీకర అగ్నిప్రమాదం బూడిద కుప్పగా మార్చింది. ఈ దృశ్యానికి చలించిన సిమ్లాకు చెందిన యువ రచయిత సౌరభ్ చౌహాన్... 'నిశ్శబ్దం తన గీతాన్ని అల్లిన కొండల దగ్గర/ క్రూరమైన మంట మసకబారింది/ శీతాకాలపు పట్టులో, అక్కడ మంచు పట్టుకుంటుంది/ కలలు కాలిపోయాయి, హృదయాలు చల్లగా మారాయి/ అగ్ని గర్జించింది, దాని నాలుక దయలేనిది/ ఏ ఆశను వదలని మృగం/ ఇళ్లు కూలిపోయాయి, రాయి నుండి ధూళి వరకు/ మండుతున్న గాలులకు జ్ఞాపకాలు కోల్పోయాయి' అంటాడు భావోద్వేగంతో.

ముఖ్యంగా పర్యావరణ మార్పుల వల్ల సంభవించే వేడి, పొడి వాతావరణ పరిస్థితులే కార్చిచ్చు వేగంగా వ్యాప్తి చెందడానికి కారణమౌతుంది. దీనివల్ల ఆ ప్రాంత జీవవైవిధ్యం దెబ్బతింటోంది. మొక్కలతోపాటు జంతుజాలానికి, సూక్ష్మజీవులు, క్రిమికీటకాలు, ఉభయచరాలు, సరీసృప జాతుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. గడ్డి, ఇతర మొక్క జాతులు కాలిపోతున్నాయి. మరోవైపు మనుషుల ఆరోగ్యంపైనా కార్చిచ్చు తీవ్ర ప్రభావం చూపుతోంది. దట్టమైన పొగ అస్థిరమైన కర్బన సమ్మేళనాలు, ఓజోన్, విష వాయువులు, సూక్ష్మజీవులు కలిసి వుంటాయి. ఇవి శ్వాసకోశ ఇన్ఫెక్షన్లతో పాటు ఆస్తమాను కలిగించవచ్చని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. పొడి నేలల్లో ఉండే కోక్సిడియోయిడ్స్ ఇమ్మిటిస్, కోక్సిడియోయిడ్స్ పోసాడాసి వంటి బ్యాక్టీరియా... దుమ్ము, పొగతో మనుషుల్లోకి చొరబడతాయి. ఇవి జ్వరం, ఫ్లూ, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కలిగిస్తాయని కాలిఫోర్నియాలో వైల్డ్‌ల్యాండ్ అగ్నిమాపక సిబ్బందిపై జరిపిన ఓ అధ్యయనం వెల్లడించింది. ఈ కార్చిచ్చులను నిలువరించాలంటే... పర్యావరణ మార్పులకు కారణమౌతోన్న శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలి. వాతావరణ మార్పులను నిలువరించేందుకు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషిచేయాలి. కార్చిచ్చుల వల్ల నాశనమైన అడవులను పునరుద్ధరించడంపై దృష్టి సారించాలి.

మహనీయుల మాట



భారతదేశం కులం, మతం, మూఢనమ్మకాల సుడిగుండంలో గిరగిరా తిరుగుతూ వుంటే... దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఎలా వుంటుంది!

- రవీంద్రనాథ్ టాగూర్, విశ్వకవి.

అస్థిరతకూ అశాంతికి అసలు కారణమెవరు?

ప్రస్తుతం



తెలకపల్లి రవి



మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది. ఆయనను దింపేయాలని వాజ్‌పేయి ఆయనను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు. ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై 19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు. మారణకాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు.

మాటిమాటికీ ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకం అనీ అస్థిరత్వం అనీ ప్రధాని మోడీ, ఆయన వత్తాసుదారులు అదే పనిగా చెబుతున్నారు. పార్లమెంటులో నిబంధనలకు విరుద్ధంగా జమిలి బిల్లు ప్రవేశ పెట్టి బలం లేదని తెలుసు గనక వాయిదా వేసుకున్నారు. ఇందుకు సంబంధించిన భిన్న వాదోపవాదాలు ఒకటైతే అసలు ఈ హడావుడి చేసిన బిజెపి వారి గతం ఎట్టిదనే ప్రశ్న చాలా ఆసక్తి కలిగిస్తుంది. గత ముప్పై ఏళ్లలో అత్యధికంగా అస్థిరత్వంతో, అశాంతితో ఆటంకాలు కలిగించిన వారు ఎవరంటే వేలు బిజెపి వైపే చూపిస్తుంది. ఉంటే తాముండాలి. లేకుంటే మరొకరిని ఉండనివ్వకూడదనేది వారి రాజకీయ తాత్వికత. ఇక అధికారం కోసం మతతత్వం ప్రకోపింపచేయడం వారి సైద్ధాంతిక తాత్వికత. ఇందుకు ఉదాహరణలు లెక్కలేనన్ని. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు 1959లో కేరళ నంబూద్రిపాద్ ప్రభుత్వంతో మొదలెట్టి ఇష్టం లేని సర్కార్లను వరుసగా కూలదోసిన మాట నిజమే. కానీ ఈ విషయంలో బిజెపి రికార్డు మరో విధంగా హానికరమైందని గుర్తించవలసి వుంది.

స్వార్థం కోసం చిచ్చు

కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే తమ లక్ష్యమైనట్టు మాట్లాడే బిజెపి దాని పూర్వ రూపమైన జనసంఘం తాము లేని చోట్ల మరెవరూ వుండకూడదనే వైఖరినే అనుసరించాయి. ప్రతిపక్ష సంఘటన ప్రభుత్వాలు ఏర్పడిన చోట్ల కూడా తగవులతో మత కలహాలతో చిచ్చు పెట్టి పడగొట్టారు. 1967లో మొదటిసారి వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడగా బెంగాల్‌లోనూ కేరళలోనూ సిపిఎం నాయకత్వం వున్న చోట్ల తప్ప మిగిలిన చోట్ల ఇలాంటి సర్కార్లు ఏర్పడ్డాయి. అవేవీ పూర్తికాలం నిలిచింది లేదు. జనసంఘం నాయకులు రకరకాల పేచీలతో అస్థిరత్వం పాలు చేశారు. ఇక వామపక్ష సర్కార్లను కేంద్ర కాంగ్రెస్ రద్దు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యం చివరకు 1975లో ఇందిరా గాంధీ ఎమర్జన్సీ విధింపుతో పరాకాష్టకు చేరింది. దానికి తక్షణ ప్రత్యామ్నాయంగా జనతా పార్టీ ఏర్పడి అధికారంలోకి వచ్చింది. జనతా పార్టీలో జనసంఘం వున్నా ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో సిపిఎం కూడా మద్దతునిచ్చింది. అయితే పూర్తి మెజార్టీతో జనతా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆరెస్సెస్ తరహా మత రాజకీయాలను పాఠ్య పుస్తకాలలో జొప్పించడమనే ఎజెండాతో వివాదం ప్రారంభమైంది. ఈ క్రమంలో చివరకు ఆరెస్సెస్ ద్వంద్వ సభ్యత్వం వదులుకోవడానికి వాజ్‌పేయి, అద్వానీల నాయకత్వంలో జనసంఘ్ వర్గం నిరాకరించడం వల్ల ఆ ప్రభుత్వం పడిపోయే స్థితి వచ్చింది. ఆ సమయంలో చరణ్‌సింగ్‌ను బలపర్చి జనతా పార్టీ చీలికకు కారకులైనారు. రాష్ట్రాలలోనైతే అన్ని చోట్లా ఈ ఇద్దరి తరపు నాయకులే చీలికలు తెచ్చి సగం సగం చొప్పున ముఖ్యమంత్రి పదవులు చేజిక్కించుకున్నారు. తర్వాత జనసంఘం వర్గం ఆయననూ వెన్నుపోటు పొడిచింది.

ఎన్టీఆర్, చంద్రబాబు తేడా

1980లో ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు. వచ్చీ రాగానే ఆమె రాష్ట్రాలలో జనతా ప్రభుత్వాలను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. 80వ దశకం పొడుగునా బిజెపి లేకుండా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పడాలన్నదే వామపక్షాల విధానంగా వుండేది. టిడిపి వ్యవస్థాపకుడు, ఎ.పి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వంటి వారు అందరూ కలసి వుండాలన్నా వామపక్షాలు విడిగానే వుంటూ వచ్చాయి. 1986లో రాజీవ్ గాంధీపై వి.పి సింగ్ తిరుగుబాటు తర్వాత మరోసారి జనతా తరహా ప్రయోగం జరగకుండా అడ్డుకోగలిగాయి. నేషనల్ ఫ్రంట్‌లోనూ బిజెపికి చోటు లభించలేదు. కాంగ్రెస్ ఓటమితో వి.పి సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు తమకు స్థానం లభించకపోవడం బిజెపికి మింగుడు పడలేదు. ఆయన మండల్ నివేదికను ఆమోదించడం అసలే నచ్చలేదు. దాంతో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ అంటూ అద్వానీ రథయాత్ర ప్రారంభించారు. ఆ అంశంపైనే ఆ ప్రభుత్వాన్ని పడగొట్టారు కూడా. వి.పి సింగ్ తర్వాత కాలంలో వాజ్‌పేయి ఏ మాత్రం బలం లేకున్నా సర్కారు ఏర్పాటు సంకేతాలిచ్చారు. తలుపులు తెరుచుకుని కూర్చున్నామన్నారు. కానీ ఎవరూ కలవలేదు. అలా రెండోసారి కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని వారే అస్థిరత్వం పాలు చేశారు. పి.వి నరసింహారావు హయాంలో దాగుడు మూతలాడుతూ బాబ్రీ మసీదును కూలదోసి ప్రపంచ వ్యాపితంగా నిరసనకు కారణమైనారు. ఆ సమయంలో వారి ఆధ్వర్యంలోని నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం అనివార్యమైంది. మసీదు కూల్చివేత ఘటనల తర్వాత ఎన్టీఆర్ 1994లో బిజెపితో పొత్తుకు నిరాకరించారు. ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసిన చంద్రబాబు నాయుడు నిలదొక్కుకునే వరకూ 1996 ఎన్నికల వరకూ వామపక్షాలతో లౌకిక పార్టీలతో వున్నారు. తర్వాత మాత్రం మారిపోయారు.

వాజ్‌పేయి ప్రహసనం

1996లో కాంగ్రెస్ బయటి నుంచి ఇచ్చే మద్దతుతో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయగల స్థితి వున్నా...అధికారం కోసం ఆరాటంలో వాజ్‌పేయి ఏ మాత్రం మెజార్టీ లేకుండా కేవలం 160 సీట్లతో 1996లో సర్కారు ఏర్పాటు చేసి 13 రోజులలో అవమానకరంగా దిగిపోయారు. తర్వాత ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని సహించలేక రెండేళ్లలోనే కాంగ్రెస్‌తో కలసి కూలదోశారు. 1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతు వల్ల 13 నెలలు నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు. ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

ముందస్తు నేత మోడీ

ఇక ఇప్పుడు జమిలి సామ్రాట్ నరేంద్ర మోడీ కార్యభూమి గుజరాత్ కథ చూద్దాం. వాజ్‌పేయి హయాంలోనే అక్కడ 1995లో కేశూభాయ్ పటేల్ ముఖ్యమంత్రి కాగా మోడీ ఆరెస్సెస్ తరపున ప్రతినిధి. కేశూభాయ్‌తో శంకర్ సింగ్ వాఘేలా విబేధించడంతో ఆ ప్రభుత్వం ప్రతిష్టంభనలో పడిన పరిస్థితిని తాను ఉపయోగించుకున్నారు. మధ్యలో రాజీ అభ్యర్థిగా సురేష్ మెహతాను సి.ఎం ను చేసినా పెద్దగా నడిచింది లేదు. వాఘేలా స్వంతంగా పార్టీ ఏర్పాటు చేసి చీలిపోవడమే అందుకు కారణమైంది. 1998 ఎన్నికల నాటికి మళ్లీ కేశూభాయ్ పటేల్‌ను తెచ్చినా నిలిచే పరిస్థితి లేకపోయింది. భూకంపం సహాయ కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డారనే కారణంతో 2001లో ఆయనను తప్పించి మోడీని సి.ఎం ను చేశారు. ఇదంతా ఏపాటి స్థిరత్వమో చూడొచ్చు. మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది. ఆయనను దింపేయాలని వాజ్‌పేయి ఆయనను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు. ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై 19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు. మారణకాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు. అదో భయానక రాజకీయ క్రీడ. ఈ విజయం తర్వాత 2004 ఎన్నికల నాటికి జాతీయ తారగా బిజెపి ఆయనను ఊరేగించింది. అగ్రనేతలైన వాజ్‌పేయి, అద్వానీలు ఇద్దరినీ వెనక్కు నెట్టి నెమ్మదిగా తాను కేంద్ర స్థానంలోకి వచ్చారు.

రాజకీయ ముసుగు

మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టు పట్టడంలో రాజకీయం ఏమిటో ఎవరికైనా అర్థమవుతుంది. ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు. ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని, మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు కార్పొరేట్ దోస్తీ మరో వైపు కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు కాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఇ.డి, సి.బి.ఐ, ఐ.టి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవశం చేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వ రంగంలో 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక, అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం.

మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టు పట్టడంలో రాజకీయం ఏమిటో ఎవరికైనా అర్థమవుతుంది. ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు. ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని, మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు కార్పొరేట్ దోస్తీ మరో వైపు కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు కాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఇ.డి, సి.బి.ఐ, ఐ.టి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవశం చేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వ రంగంలో 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక, అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం.

వాట్సాప్ పాలనలో విశ్వసనీయత ఎంత?

వ్యాఖ్య





కందారపు మురళి

రాష్ట్రంలో ఇకపై 153 రకాల పౌర సేవలను వాట్సాప్‌లో ఒక క్లిక్ ద్వారా పొందవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత నెల రోజులుగా ప్రకటనలు చేస్తున్న విషయం విదితమే.

జనన, మరణ, కుల, ఆదాయం, స్థానికత, కరెంటు బిల్లుల చెల్లింపు, మున్సిపల్ పన్నులు, కొళాయి పన్ను తదితరాలతో పాటు భూ వ్యవహారాలకు సంబంధించి ఈసీ, అడంగల్ వంటి వాటికై ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా 153 రకాల పౌర సేవలు వాట్సాప్ ద్వారా పొందవచ్చని, సెల్‌ఫోన్ ఇప్పుడు చేతిలో ఆయుధమని చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

చంద్రబాబు చెబుతున్నట్టు 153 రకాల సేవలు ప్రభుత్వ కార్యా లయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ప్రజలకు తేలిగ్గా అందుబాటులోకి వస్తే మంచిదే. అయితే కొన్ని అంశాలను పరిశీలించాల్సి వుంది.

2024 అక్టోబర్ 22న న్యూఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, సీనియర్ ఐఏఎస్ అధికారి, పరిశ్రమల శాఖా కార్యదర్శి యువరాజ్, ఆర్టిజిఎస్ సీఈవో దినేష్, మెటా కంపెనీ ఇండియా ఉపాధ్యక్షులు సంధ్యా దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గే, పబ్లిక్ పాలసీ డైరెక్టర్ నటాషా లు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలలో ఏముందో ఇప్పటివరకు బయటకు వెల్లడి కాలేదు. ఈ సేవలు రాష్ట్రానికి అందించినందుకు 'మెటా' సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లింపులు చేస్తున్నది? వినియోగదారుల డేటా గోప్యత, సైబర్ భద్రత వంటి విషయాలపై స్పష్టత రాలేదు.

గతంలో కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఆధార్ డేటాను కొన్ని ప్రైవేటు సంస్థలు అమ్మకానికి పెట్టిన విషయం విదితమే. 2018లో జరిగిన ఈ ఆధార్ డేటా లీకేజీ వ్యవహారం దేశాన్ని ఓ కుదుపు కుదిపింది.

ఇప్పటికీ ఆన్‌లైన్ మోసాలు, ప్రజల గోప్యతకు సంబంధించిన అంశాలు పెద్ద ఎత్తున చర్చగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల సమాచార గోప్యతకు సంబంధించిన వివరాలు కొత్త చిక్కుల్ని తెచ్చి పెడతాయా? అన్న ప్రశ్న టెక్నాలజీ నిపుణులను వేధిస్తున్నది.

2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డేటా ప్రైవసీ చట్టం అమలులోకి రాకముందే 'మెటా' లాంటి కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని ఇప్పటికే పలువురు చెబుతున్నారు. గతంలో 'మీ సేవ' పేరిట ఈ గవర్నెన్స్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం దాని ఫలితాలను అంచనా వేయకుండానే, మరో పేరు పెట్టి ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడం సమంజసమా? అన్న ప్రశ్న వ్యక్తమవుతున్నది.

ఈ తరహా ఒప్పందాలు కూటమి ప్రభుత్వంతో మొదలైనవి కావు.

గతం లోను ఇలాంటి ఒప్పందాలు జరిగాయి. 2022 ఫిబ్రవరి 10వ తేదీన డిజిటల్ స్కిల్‌పై వాట్సాప్ ఇండియా నాటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. రాష్ట్రం లోని యువతకు డిజిటల్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వటానికి, వాట్సాప్ ఇండియా ముందుకు వచ్చిందని, రాష్ట్రంలో 15 వేల మంది యువతకు పది రోజులు పాటు శిక్షణ ఇచ్చి వారిలో ఎంపికైన వారికి మైక్రోసాఫ్ట్ కంపెనీ ద్వారా ఏడాది పాటు శిక్షణ ఇస్తామని వాట్సాప్ ఇండియా ఉద్యోగాల ఎంపిక సందర్భంగా సహకారం అందిస్తుందని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటన చేసింది. 40 సాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సులను 1.62 లక్షల మందికి అందించనున్నామని 31 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామని నాడు ప్రకటించారు. ఆ తరువాత ఆ పథకం ఏమైంది? 1.62 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయా? నేటి వరకు తెలియదు.

ఆ తరువాత 2022 జూన్ 10న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను త్వరితగతిన ప్రజలకు చేరడానికి వాట్సాప్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. వాట్సాప్ కంపెనీ, ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడిందన్న సమాచారం లేదు. వైసీపీకి ఎన్నికల సందర్భంగా కంపెనీ బాగా దోహద పడిందన్నది జనవాక్యం.

/వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు/

సెటైర్

అదానీ-ఆర్థిక వ్యవస్థ!

చాయ్ తాగుతూ పేపర్ చదువుతున్న పుష్పకుమార్ ఒక్కసారి గా పాత సినిమాలో విలన్‌లా వికటాట్టహాసం చేశాడు. వంటింట్లో పనిలో ఉన్న లక్ష్మి కంగారుపడి హాల్లోకి వచ్చింది.

"చూశావా! చివరికి మంచే గెలుస్తుంది!" అన్నాడు పుష్పకుమార్ భార్యతో.

"చివరికి మంచి గెలిచే మాట నిజం! అంతేకాని గెలిచిన ప్రతిదీ మంచి కాకపోవచ్చు. ఒక్కసారి చెడు కూడా గెలుస్తుంటుంది. అంత మాత్రాన అదంతా మంచి కాదు!" ఇంతకూ మీ వికటాట్టహాసానికి కారణం సెలవియ్యండి మహాప్రభూ!" అన్నది లక్ష్మి.

"హిండెన్‌బర్గ్ దుకాణం మూసేశారంట!" అన్నాడు పుష్పకుమార్ చిద్విలాసంగా.

"ఆ దుకాణం మూసేస్తే మీకెందుకింత ఆనందం!" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"మన దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయాలని ఎన్ని కుట్రలు చేసింది? చేసిన పాపం ఊరికే పోదు! సనాతన ధర్మం జోలికొస్తే పుట్ట గతులుండవు!" అన్నాడు పుష్పకుమార్.

"నేను మీకు చాయ్ మాత్రమే ఇచ్చాను. అందులో మీరేదైనా కలుపుకున్నారా ఏమిటి? ఒకదానికొకటి సంబంధం లేకుండా మాట్లాడు తున్నారు? ఆర్థిక వ్యవస్థకూ, సనాతన ధర్మానికి లింకు ఏమిటండి?" అడిగింది లక్ష్మి.

"పిచ్చిదానా అదొక ధర్మ సూక్ష్మం! అలాంటి లోతైన విషయాలు నీలాంటి అర్భకులకు అర్థం కావులే!" అన్నాడు పుష్ప కుమార్ మరింత చిద్విలాసంగా!

"అర్థమయ్యేలా చెప్పండి స్వామి!" అన్నది లక్ష్మి.

"మునిగిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెడుతున్నది ఎవరో తెలుసా? అదానీ, అంబానీలే! వారిద్దరినీ దెబ్బతీస్తే ఈ దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది! దేశ ఆర్థిక వ్యవస్థ కూలిపోతే పెద్దాయన కీర్తి, ప్రతిష్టలు దెబ్బతిని ప్రభుత్వం పడిపోతుంది! ఈ భూ ప్రపంచంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఏకైన ప్రభుత్వం అధికారం లేకపోతే, సైతానులు, రాక్షసులు అధికారంలోకి వస్తారు. అప్పుడంతా అల్లకల్లోలమే!" అని పుష్ప కుమార్ అంటూండగానే లక్ష్మి కళ్లు తిరిగి కింద పడిపోయింది! నీళ్లు చల్లాక లేచి కూర్చున్నది.

"అదానీకి నష్టం జరిగితే ప్రపంచం సర్వనాశనం అవుతుందా? అప్పుడెప్పుడో ఇందిరే ఇండియా అనే వారంటా. ఇప్పుడు అదానీయే ఆర్థిక వ్యవస్థ అయ్యిందన్నమాట!" అన్నది లక్ష్మి.



"మీరు చేస్తున్నది గవర్నమెంటు ఉద్యోగం! తింటున్నది ప్రజల సొమ్ము! అదాని పాట పాడటానికి సిగ్గుగా లేదు? పెద్దాయన అమలు చేస్తున్న విధానం వల్ల మన లాంటి వాళ్ల రెక్కల కష్టం అదానీ జేబుల్లోకి వెళుతున్నదని తెలుసుకోండి! ఈ దోపిడీ మనకు అర్థం కాకూడదనే సనాతన ధర్మాన్ని అడ్డుపెడు తున్నారు. ఇది అర్థం చేసుకోవటం మీలాంటి వాళ్లకి మరీ అవసరం!"

"అదానీ అంటే మరేమిటనుకున్నావు!" అన్నాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ మూసేస్తే, ఆ సంస్థ చెప్పినవి అబద్ధాలు అయిపోతాయా?" అడిగింది లక్ష్మి.

"అంతేకదా! అదానీ, మోడీని, మన దేశాన్ని దెబ్బ తీయడానికి ఆ హిండెన్‌బర్గ్ సంస్థ పెట్టి, అబద్ధాలు ప్రచారం చేసి, అది నిరూపించలేక, ఇప్పుడు దుకాణం మూసేసి, తెరవెనక్కి పోతున్నారు!" అన్నాడు పుష్పకుమార్. లక్ష్మి చిన్నగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు!" చిరాగ్గా అడిగాడు పుష్పకుమార్.

"అదానీ మీద కూడా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు చేసింది హిండెన్‌బర్గ్ సంస్థ. అనేక సాక్ష్యాధారాలున్న పత్రాలు కూడా బయటపెట్టింది. మీరు అవన్నీ అబద్ధమని అనుకోవచ్చు! కాని ఆ అక్రమాల మీద పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, విచారణలో ఆరోపణలు రుజువు కాకపోతే అప్పుడు అదానీని దెబ్బ తీయటానికి కుట్ర పన్నారని అనవచ్చు. మన దేశంలో ఇప్పటి వరకూ అదానీపై అలాంటి విచారణ ఏదీ జరగలేదు కదా!" అన్నది లక్ష్మి.

"అదానీ మీద ఎలాంటి విచారణ అవసరం లేదు! ఆయన మచ్చ లేని చంద్రుడు!" అన్నాడు పుష్పకుమార్.

"అలా అని మీరనుకోవచ్చు. కాని అదానీ అంతగా అవకతవకలు చేస్తున్నా విచారణ కూడా జరిపించలేదని విదేశాల్లో అంతా నవ్వు కుంటున్నారు! ఇదే అమెరికా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో జరిగితే ప్రభుత్వం దిగిపోయి ఉండేది! మీరేమో సనాతన ధర్మం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు!" అన్నది లక్ష్మి.

"ఇదుగో నన్నేమైనా అను! కాని అదానీని, సనాతన ధర్మాన్ని ఏమైనా అంటే సహించను!" అన్నాడు పుష్పకుమార్ కోపంగా.

"మీరు చేస్తున్నది గవర్నమెంటు ఉద్యోగం! తింటున్నది ప్రజల సొమ్ము! అదాని పాట పాడటానికి సిగ్గుగా లేదు? పెద్దాయన అమలు చేస్తున్న విధానం వల్ల మన లాంటి వాళ్ల రెక్కల కష్టం అదానీ జేబుల్లోకి వెళుతున్నదని తెలుసుకోండి! ఈ దోపిడీ మనకు అర్థం కాకూడదనే సనాతన ధర్మాన్ని అడ్డుపెడు తున్నారు. ఇది అర్థం చేసుకోవటం మీలాంటి వాళ్లకి మరీ అవసరం!" అని ముగించింది లక్ష్మి.

- ఉషాకిరణ్

ఢిల్లీలో విమాన సర్వీసుల నిర్వహణపై ఆంక్షలు

న్యూఢిల్లీ : ఢిల్లీలో ఉదయం 10.20 గంటల నుంచి 12.45 గంటలకు వచ్చే ఏనిమిది రోజులు విమాన సర్వీసుల రాకపోకలపై నిషేధం విధించినట్లు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ సంస్థ (డిఐఎఎల్) ప్రకటించింది. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డిఐఎఎల్ శనివారం ప్రకటించింది. దేశంలోనే అత్యంత బిజీగా ఉండే విమానాశ్రయంగా ఇందిరాగాంధీ అంతర్జాతీయ సంస్థ (ఐజిఐఎ) నిలుస్తుంది. ప్రతి రోజూ 1300 విమాన సర్వీసులు నడుస్తాయి. ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలతో తాము ప్రయాణించే విమాన సర్వీసుల అప్‌డేటెడ్ సమాచారం తనిఖీ చేసుకోవాలని సూచించింది.

మొదటిసారి కోర్టుకు దక్షిణ కొరియా అధ్యక్షుడు

సియోల్ : అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అరెస్ట్ వారెంట్‌పై విచారణ కోసం శనివారం మొదటిసారి కోర్టుకు హాజరయ్యారు. గతేడాది డిసెంబర్ 3న ఏకపక్షంగా జారీ చేసిన మార్షల్ లా డిక్రీపై దర్యాప్తు అధికారులు విచారిస్తున్నందున నిర్బంధాన్ని కొనసాగిస్తారా లేదా అనేది నిర్ణయించాల్సి ఉంది. యూన్‌ను ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు ఎట్టకేలకు గురువారం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. యూన్ కస్టడీ పొడిగించేందుకు దర్యాప్తు అధికారులు శుక్రవారం కొత్త వారెంట్‌ను జారీ చేయాల్సిందిగా అభ్యర్థించారు. ప్రస్తుతం యూన్ కస్టడీలోనే ఉన్నారు. యూన్ మద్దతుదారులు శనివారం కోర్టు ఎదుట నిరసనకు దిగారు. యూన్‌ను కోర్టుకు తీసుకువస్తున్న వ్యాన్‌ను చుట్టుముట్టేందుకు యత్నించినట్లు స్థానిక మీడియా తెలిపింది.

ఉపాధి లేక నిరుద్యోగుల కష్టాలు

- హామీ అమలుపై సర్కారు నిర్లక్ష్యం
- ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించని వైనం



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

గతంలో మా పాలనలో లక్షలాది టీచర్ పోస్టులు భర్తీ చేశాం. జగన్ ప్రభుత్వంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. జాబు కావాలంటే బాబు రావాలి. మేము అధికారంలోకి వస్తే 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం. నిరాశలో ఉన్న నిరుద్యోగులకు మంచి రోజులు రప్పిస్తాం అంటూ గతేడాది జనవరి 10న తునిలో జరిగిన 'రా కదలి రా' సభలో టిడిపి అధినేత, ప్రస్తుత సిఎం చంద్రబాబు హామీలు గుప్పించారు. ఇక్కడే కాదు ఎన్నికల అన్ని సభల్లోనూ ఆయన వరాల జల్లు కురిపించారు. ఆయన్ను నమ్మిన నిరుద్యోగులు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఇచ్చి గద్దెనెక్కించారు. తీరా చూస్తే ఒక్క ఉద్యోగం కూడా ఇచ్చిన పాపాన పోలేదు. పైగా రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్లు, ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న వారిని, ఎపి ఫైబర్ నెట్ లిమిటెడ్, ఎపి ఎండిసి కాంట్రాక్టు వర్కర్లు, యానిమేటర్లు, కొన్ని చోట్ల ఆశా వర్కర్లను, స్కూల్ ఆయాలను తొలగించారు. ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కల్పించక పోగా తిరిగి ఉన్న ఉద్యోగాలను పీకేస్తుండడంపై ఇటు బాధితులు, అటు నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోంది. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ప్రభుత్వ నియామకాలు చేపట్టడం లేదు. దీంతో వాటిలో నమోదైన వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలా ఉమ్మడి జిల్లాలో ఏటా 40 వేల మందికి పైగా నిరుద్యోగులు తయారవుతున్నారు. గత 12 ఏళ్ళలో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు తయారయ్యారనేది ఒక అంచనా. అటు ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు నామమాత్రంగానే దక్కుతున్నాయి. దీంతో అనేకమంది విద్యలేని పరిస్థితుల్లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి సుదూర ప్రాంతాలకు వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

అగమ్య గోచరంగా నిరుద్యోగుల పరిస్థితి

జిల్లాలో అనేకమంది నిరుద్యోగులు ప్రైవేట్ సంస్థల్లో చిన్న, చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అరకొర వేతనాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. పలు ప్రైవేటు సంస్థల్లో రూ.7 వేలు నుంచి రూ.9 వేలకే పని చేయాల్సి వస్తోంది. ఉన్నత చదువులు చదువుకున్న వారు సైతం తక్కువ వేతనాలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు దక్కకపోవడంతో అనేకమంది అప్పుల పాలవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కాకినాడ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నప్పటికీ పరిశ్రమలు రావడం లేదు. కాకినాడ సెజ్‌లో నేటికీ పదివేల ఎకరాల భూములు ఖాళీగానే ఉన్నాయి. 13 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఒక పరిశ్రమ కూడా రాకపోవడంతో ఉపాధికి ఆమడ దూరంలో నిరుద్యోగులు బతుకుతున్నారు. ఒకటి, రెండు అతి చిన్న పరిశ్రమలు వచ్చినప్పటికీ పదుల సంఖ్యలో మాత్రమే ఉపాధి అవకాశాలు దక్కిన పరిస్థితి ఉంది.

జాబ్ క్యాలెండర్ ఏమైంది..?

ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు జరిగిన పలు సభలు, సమావేశాల్లో చెప్పుకొచ్చారు. భారీగా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాక నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడిచిపోయింది. నేటికీ ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వలేక పోయింది. నిరుద్యోగ భృతిపై స్పష్టత రావడం లేదు. పైగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలన్నీ యువతను దృష్టిలో ఉంచుకుని హామీలు గుప్పించాయి. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆశలు రేకెత్తించాయి. తాము అధికారంలోకి వస్తే 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.


ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారు. 7 నెలలు గడిచిపోతున్నా క్యాలెండర్ లేదు. మెగా డిఎస్‌సి అని చెప్పి మినీ డిఎస్‌సిని విడుదల చేసినప్పటికీ భర్తీ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది. తక్షణమే స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి. పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లు విడుదల చేయాలి.

-పి.దుర్గాప్రసాద్,
డివైఎఫ్ఐ కాకినాడ జిల్లా కో- కన్వీనర్

ప్రజలను మోసగించేందుకే బీహార్ కుల సర్వే

- నితీష్‌పై రాహుల్ గాంధీ విమర్శ



పాట్నా : బీహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వం నిర్వహించే కుల సర్వే ప్రజలను మోసగించేందుకు చేసే ప్రయత్నమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశంలో అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించేందుకు తప్పనిసరిగా చేపట్టే చర్యగా కుల గణనను నిర్వహించాలన్న డిమాండ్‌కు పార్టీ కట్టుబడి వుంటుందని చెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని దెబ్బతీస్తున్నాయని, దేశంలో అణగదొక్కబడిన వర్గాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన 'నిజమైన స్వాతంత్ర్యం' అన్న వ్యాఖ్య దేశ రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమైనదని అన్నారు. సంవిధాన్ సురక్షా సమ్మేళన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ దళితులు, మైనారిటీలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలు అందరూ కలిసి దేశ జనాభాలో 90శాతం మంది వుంటారని, కానీ వారు వ్యవస్థలో భాగం కారని అన్నారు. ఇందువల్లే కుల గణన నిర్వహించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. దేనికైనా తెగించి తమ పార్టీ దీన్ని ఆమోదించేలా చర్యలు తీసుకుంటుందని పార్లమెంట్‌లో తాను చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో వివిధ కులాల వారు ఎంతమంది వున్నారో తెలుసుకోవడానికి కుల గణన నిర్వహించడం ఉద్దేశం కాదన్నారు. దేశ సంపదలో వారి భాగస్వామ్యం ఎంత వుందో తెలుసుకోవడం అసలు లక్ష్యమన్నారు. బీహార్ ప్రభుత్వం చేసేది తమకు వద్దన్నారు. ఇది కేవలం ప్రజలను తెలివితక్కువ వాళ్ళను చేయడానికేనని రాహుల్ విమర్శించారు.

భూమి రికార్డులు మార్చారని రైతు కుటుంబం ఆందోళన

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- శాంతిపురం (చిత్తూరు జిల్లా)

తమ వారసత్వంగా వస్తున్న భూములు సంబందించిన భూ రికార్డును చిత్తూరు జిల్లా శాంతిపురం మండల రెవెన్యూ అధికారులు వేరే వారి పేరుకి మార్చారని నాయనపల్లికి చెందిన లక్ష్మమ్మ కుమారుడు లక్ష్మీపతి కుటుంబ సభ్యులు శనివారం మండల సచివాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాయనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు 30 సొంనేగానిపల్లి రెవెన్యూ గ్రామ దాఖలాల ప్రకారం సర్వే నెంబర్ 15 /5లో 40 సెంట్లు భూమి జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ఈ భూమికి సంబంధించిన భూ రికార్డును కర్ణాటక రాష్ట్రం చిలకుత్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పేరు పైన రెవెన్యూ అధికారులు మార్చినట్లు వారు తెలిపారు. తమది నిరుపేద కుటుంబమని కూలి చేస్తే గాని కడుపు నిండదని అలాంటి వారికి సంబంధించిన భూములు వేరే వారి పేర్లు ఎలా మారుస్తారని కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబానికి జీవనాధారంగా ఉన్న భూమికి సంబంధించిన రికార్డులు వేరే వారి పేర్లకు మార్చడంతో మనస్థాపన గురై తమ కుటుంబం సచివాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటున్నామన్నారు. తాము సాగు చేసుకుంటున్న భూమి సంబంధించిన రికార్డులు వారి తల్లిపేరుపై ఇంట్లోనే ఉన్నాయనుకున్నామని చూస్తే ఆన్లైన్లో వేరే వారి పేరు రావడంతో ఎందుకిలా జరిగిందని రెవెన్యూ అధికారులు అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఏం చేయాలో దిక్కుతోచలేదన్నారు. విషయం తెలుసుకున్న సోనియగానిపల్లి సర్పంచ్ మంజునాథ్ రెడ్డి, టిడిపి మాజీ మండల అధ్యక్షుడు విజయరామిరెడ్డిలు మండల సచివాలయం వద్దకు వెళ్లి వారిని సముదాయించారు. పూర్తి వివరాలు తెలుసుకొని రైతు కుటుంబానికి న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. తహశీల్దార్ శివయ్య అక్కడికి చేరుకుని రికార్డులు ప్రకారమే తమ సిబ్బంది ఆన్లైన్లో నమోదు చేసి ఉంటారని పూర్తి వివరాలు తెలుసుకొని తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చి కుప్పం ఆర్డీవో కార్యాలయంకు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తగు న్యాయం చేస్తామని ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు.

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని హసీనా ఆడియో విడుదల

న్యూఢిల్లీ/ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా శనివారం తమ పార్టీ అవామీ లీగ్ పార్టీ ఫేస్‌బుక్ ఖాతాలో ఓ ఆడియోను విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో దేశాన్ని విడిచి వెళ్లిపోతున్న సమయంలో తాను, తన సోదరి ప్రాణాపాయం నుండి ఎలా తప్పించుకున్నారో ఆ ఆడియోలో వివరించారు. రాజకీయ ప్రత్యర్థులు తనను చంపడానికి యత్నించారని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టులో అవామీ లీగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పలువురు మరణించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా తన పదవికి రాజీనామా చేసి, అధికారిక భవనం నుండి భారత్ వచ్చేశారు. ఆ సమయంలోనే తమపై హత్యాయత్నం జరిగిందని, తాను తన సోదరి 20-25 నిమిషాల వ్యవధిలో మృత్యువు నుండి తప్పించుకున్నామని ఆ ఆడియోలో తెలిపారు. అప్పటి నుండి వారు భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.

2004 ఆగస్టు 21న గ్రేనేడ్ దాడి జరిగిందని, గాయాలతో తప్పించుకున్నానని అన్నారు. 2000లో గోపాల్ గంజ్ జిల్లాలో కొటలీపర ఎన్నికల ర్యాలీకి వెళ్లిన హసీనాపై ఉగ్రవాదులు దాడికి యత్నించారు. తన ప్రత్యర్థులు తనను చంపేందుకు ఎలా కుట్ర పన్నారో ప్రపంచమంతా చూసిందని భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం తాను ప్రాణాలతో ఉన్నప్పటికీ తన దేశం, ఇంటికి దూరమయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థుల దాడిలో తన నివాసంలోని ప్రతి వస్తువు కాలిపోయిందని అన్నారు.

బాంబులు విసిరి, కాల్పులు జరిపి మార్కెట్‌లో పుట్టినరోజు వేడుకలు

- కాన్పూర్‌లో గ్యాంగ్ హల్‌చల్

లక్నో : ఓ గ్యాంగ్ రద్దీగా ఉండే మార్కెట్‌లో బాంబులు విసిరి, కాల్పులు జరిపి భయాందోళన సృష్టించింది. తమ లీడర్ పుట్టిన రోజు పేరుతో ఈ దురాగతానికి పాల్పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ నెల 15న ఈ సంఘటన జరిగింది. కాన్పూర్‌లోని లాల్ బంగ్లా ప్రాంతంలో ఉన్న రద్దీ మార్కెట్ వద్ద అలజడి సృష్టించడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు జరిపారు. ఆ ప్రాంతంలోని సిసి టివి ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ బాంబులు విసిరి కాల్పులు జరిపిన నిందితులను గుర్తించారు. 18 ఏళ్ల సాహిల్, 27 ఏళ్ల దేబు కుమార్ వాల్మీకి, 23 ఏళ్ల రజ్జుల్లాను అరెస్ట్ చేశారు. మార్కెట్‌లోని వ్యాపారుల్లో ధైర్యం నింపేందుకే నిందితులను అక్కడ ఊరేగించినట్లు సంబంధిత పోలీసు అధికారి చెప్పారు. నిందితుల సహచరులపై నిఘా ఉంచామని, వారిపై కూడా తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

సెమీస్‌లో ఓడిన సాత్విక్-చిరాగ్

ఇండియా ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరు

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సింగిల్స్, మిగిలిన విభాగాల్లో ఇప్పటికే ఓడిన భారత షట్లర్లు సెమీస్‌కు చేరిన ఏకైక డబుల్ జోడీ సాత్విక్-చిరాగ్ శనివారం జరిగిన పోటీలో వరుససెట్లలో ఓటమిపాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ 18-21, 14-21తో మలేషియాకు చెందిన గో-ఇజుద్దీన్ చేతిలో పరాజయాన్ని చవిచూశారు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి కొరియాకు చెందిన ఎస్.వై.అన్, ఇండోనేషియాకు చెందిన ఛో-ఛువాంగ్ ప్రవేశించారు. శనివారం జరిగిన సెమీస్‌లో అన్ 21-19, 21-16తో మలేషియాకు చెందిన టంగ్‌జంగ్‌ను చిత్తుచేయగా.. మరో సెమీస్‌లో ఛోఛువాంగ్ 11-21, 24-22, 21-19తో మియాజాకి(జపాన్)ను ఓడించింది.

బిజెపి మేనిఫెస్టోకు ప్రధాని ఆమోదం ఉందా?

ఆప్ ప్రతినిధి ప్రియాంక కక్కర్



న్యూఢిల్లీ : బిజెపి మేనిఫెస్టోకు ప్రధాని ఆమోద ముద్ర ఉందా? అని ఆప్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ ప్రశ్నించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విడుదల చేసిన మేనిఫెస్టోపై శనివారం ప్రియాంక కక్కర్ విరుచుకుపడ్డారు. ఆప్ ప్రభుత్వ పథకాలను బిజెపి కాపీ కొట్టిందని అన్నారు. "ఢిల్లీలో సంక్షేమ పథకాలు కొనసాగుతాయని బిజెపి తన మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. కేజ్రీవాల్ పథకాలను తమ మేనిఫెస్టోలో ఆమోదించింది, అంటే ఇప్పటివరకు ప్రధాని మోడీ మన పథకాలను ఉచితాలు అంటూ అబద్ధాలు చెబుతున్నారని అర్థం" అని అన్నారు. ఢిల్లీలో శాంతి భద్రతల పరిస్థితులపై బిజెపి మేనిఫెస్టో పూర్తిగా మౌనంగా ఉందని, నేరగాళ్ల ముఠాలు ఢిల్లీని ఆక్రమించాయని చెప్పారు. ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందిస్తూ... బిజెపికి సొంత ఆలోచనలు, దార్శనికత లేవని అన్నారు. కేజ్రీవాల్ పాలనా నమూనాను మాత్రమే అనుసరిస్తున్నారని చెప్పారు.

ప్రి క్వార్టర్స్‌కు సిన్నర్, డి-మినర్

మూడోరౌండ్‌లో ఓడిన ఫ్రిట్జ్, మసెట్టి
ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్


నాల్గోరౌండ్‌కు చేరిన సిన్నర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్, ఆస్ట్రేలియాకు చెందిన 8వ సీడ్ డి-మినర్ ప్రవేశించారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీల్లో సిన్నర్ 6-3, 6-4, 6-2తో గిరోన్(అమెరికా)ను వరుససెట్లలో ఓడించగా.. డి-మినర్ 5-7, 7-6(7-3), 6-3, 6-3తో 31వ సీడ్ సెరెండోలోను ఓడించాడు. ఇక 4వ సీడ్, అమెరికాకు చెందిన ఫ్రిట్జ్ 6-3, 5-7, 6-7(1-7), 4-6తో మోన్‌ఫిల్(ఫ్రాన్స్) చేతిలో అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. ఇక 19వ సీడ్ ఖచనోవ్(రష్యా) 3-6, 6-7(5-7), 2-6తో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ మిఛెల్సన్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఇక 16వ సీడ్ మసెట్టి 3-6, 6-3, 4-6, 6-7(5-7)తో 21వ సీడ్, షెల్టన్(అమెరికా) చేతిలో పోరాడి ఓడాడు. మరో ఐదుసెట్ల హోరాహోరీ పోరులో 13వ సీడ్ రూనే(డెన్మార్క్) 6-7(5-7), 6-3, 4-6, 6-4, 6-4తో కెక్మోనోవిక్(క్రొయేషియా)పై చెమటోడ్చి నెగ్గాడు. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన బాలాజీ జోడి ఓటమిపాలైంది. రెండో రౌండ్‌లో బాలాజీ(భారత్)-రెయాస్(మెక్సికో) జంట 6-7(1-7), 6-4, 3-6తో పోర్చుగల్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు.

స్విటోలినా, రైబకినా ముందుకు..

మహిళల సింగిల్స్‌లో 6వ సీడ్, కజకిస్తాన్‌కు చెందిన రైబకినా, 28వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన ఎలేనా స్విటోలినా ప్రి క్వార్టర్స్‌కు చేరారు. స్విటోలినా 2-6, 6-4, 6-0తో 4వ సీడ్ పోలిని(పోలండ్)ను చిత్తుచేసింది. ఇక రైబకినా 6-3, 6-4తో 32వ సీడ్, ఉక్రెయిన్‌కు చెందిన యస్ట్రెమెస్కాను ఓడించింది. ఇతర పోటీల్లో 19వ సీడ్, అమెరికాకు చెందిన కీస్ 6-4, 6-4తో సహచర క్రీడాకారిణి 10వ సీడ్, కొలిన్స్‌ను ఓడించింది.

ఎన్‌టిఆర్ జీవితం ఆదర్శనీయం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ నట జీవితం, రాజకీయ జీవితం నేటి తరానికి ఆదర్శనీయం, ఆచరణీయమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం విడుదల చేసిన ప్రకటనలో నివాళులర్పించారు. నటుడుగా ఆయన స్ఫురణకు వస్తే అభినయించిన పాత్రలే కళ్లముందు మెదులుతాయన్నారు. రాజకీయ నేతగా తలంపుకొస్తే ఆయన ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని పేర్కొన్నారు. అంతటి బలీయమైన ముద్రవేసిన నందమూరి తారక రామారావు తెలుగు వారైనందుకు గర్వకారణమన్నారు.

డీన్‌ల నియామకంపై పిల్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ డీన్‌ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు డిస్మిస్ చేసింది. డీన్‌లు వీర బ్రహ్మయ్య, జె సురేష్, జెవి రమణ, డైరెక్టర్లు కె సర్జన్‌రావు, జి వెంకట్ నాయుడు, రిజిస్ట్రార్ ఎ రవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వి చెంగల్వ రాయులు నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను కొట్టేసింది. వ్యక్తిగత, కుటిల లబ్ధి పిల్ దాఖలు చేశారని తప్పు పట్టింది. పిల్ దాఖలు చేసిన ఎస్‌పి వెటర్నరీ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కె మౌళి కృష్ణకు రూ.50 వేల ఖర్చులు విధించింది. ఈ మొత్తాన్ని న్యాయ సేవాధికార సంస్థకు చెల్లించాలని హైకోర్టు పేర్కొంది. ఈ డబ్బు దృష్టి లోపం, వినికిడి లోపం ఉన్న వారికి ఉపయోగించాలని తెలిపింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. తన భార్య డాక్టర్ శ్రీలత డీన్ పోస్టుకు దరఖాస్తు చేసి, ఎంపిక కాలేదన్న ఉద్దేశంతోనే మౌళి కృష్ణ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని తప్పు పట్టింది.

ఏ సినిమాకైనా సంగీతం గుండె లాంటిది : హీరో కిరణ్

ప్రజాశక్తి-మదనపల్లి (అన్నమయ్య జిల్లా)

ఏ సినిమాకైనా సంగీతం గుండె లాంటిదని సినీ హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని మిట్స్ కళాశాలలో కిరణ్ అబ్బవరం తాను హీరోగా నటించిన నూతన సినిమా దిల్‌రుబా సినిమా పాటను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. దిల్‌రుబా చిత్రంలో అగ్గిపుల్ల సాంగ్ ప్రేక్షకులతో లోతుగా ప్రతిధ్వనిస్తుందన్నారు. మంత్రముగ్ధులను చేసే మా సినిమా టీజర్ ఇప్పటికే అభిమానులలో సంచలనం సృష్టించాయి, సినిమా విడుదల కోసం అంచనాలను పెంచిందని తెలిపారు. ఈ లాంచ్‌లో మా పాటకు మిట్స్ విద్యార్థులు చేసిన డాన్స్ చాలా బాగుందని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. సాంగ్ ప్రారంభోత్సవానికి కృషి చేసిన మిట్స్ యాజమాన్యం, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రుక్సార్ ధిల్లాన్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ విశ్వాస్ డేనియల్, కొరియోగ్రాఫర్ జిట్టు మాస్టర్, గేయ రచయిత భాస్కర్ భట్ల, దర్శకుడు, రచయిత విశ్వ కరుణ్, కళాశాల ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రెసిడెంట్ ద్వారకానాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, కమల్ బాషా పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

- ప్రయివేట్ ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (వైఎస్ఆర్ జిల్లా)

ఆరోగ్యం మెరుగుపరుచుకునేందుకు ఓ మహిళ ఆసుపత్రిలో చేరగా వైద్యులు చేసిన వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. యర్రగుంట్ల మండలం తుమ్మలపల్లెకు చెందిన వడ్డారపు రమాదేవి (35) కడుపునొప్పితో బాధ పడుతూ చికిత్స కోసమని స్థానిక కెవిఆర్ ఆసుపత్రిలో శుక్రవారం చేరారు. వైద్యులు పరీక్షించి అపెండిక్స్ సమస్య ఉందని ఆపరేషన్ చేయాలని సూ చించారు. ఆపరేషన్ చేశారు. అనంతరం శనివారం రమాదేవి మృతి చెందారు. మృతురాలికి భర్త ముగ్గురు పిల్లలున్నారు. మృతి చెందిన విషయాన్ని వైద్యులు గోప్యంగా ఉంచారు. విషయం తెల ుసుకున్న కుటుంబం సభ్యులు ఆ స్పత్రికి సిబ్బందిపై ఆగ్రహించి ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సమీపంలో ధర్నా చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులను సర్ది చెప్పి పరిస్థితి అదుపులోకి తెచ్చారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- తణుకు బాలోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు (పశ్చిమగోదావరి జిల్లా)

విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టపడి చదువుకునే వాతావరణం కల్పించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయం వద్ద ఈనెల 24, 25 తేదీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే బాలోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల అభిరుచులను, సృజనాత్మకతను ప్రోత్సహించే పరిస్థితులను బాలోత్సవాలు కల్పిస్తాయని అన్నారు. తణుకు పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులను ఈ సంబరాల్లో పాల్గొనేటట్లు యాజమాన్యాలు, తల్లిదండ్రులు చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పిఎల్.నరసింహారావు, పి.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛత, శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- ప్రజలకు పవన్ కల్యాణ్ పిలుపు
- పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలు స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో పాల్గొన్నారు. పారిశుధ్య తరలింపు వాహనాలను ప్రారంభించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రంలో మొక్కను నాటారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు.

చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, శానిటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరికరాల పనితీరును పరిశీలించారు. వ్యర్థాలతో వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించి స్వయంగా వర్మి కంపోస్ట్‌ను పిట్‌లలో చల్లారు. చెత్త నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల యంత్ర పరికరాల పనితీరును పరిశీలించారు. సంపద సృష్టి కేంద్రాల సహకారంతో పండించిన పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'స్వచ్ఛత అనేది ప్రజల జీవన విధానంలో



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న పవన్ కల్యాణ్

భాగం కావాలి. శుభ్రత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలి. కేవలం పారిశుధ్య కార్మికులకో, క్లాప్ మిత్రలకో మాత్రమే బాధ్యత అనుకోవద్దు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం అనేది మన అందరి బాధ్యత' అని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, గ్రామీణాభివద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, జడ్‌పి చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల మార్గదర్శకుడు ఎన్‌టిఆర్

- వర్ధంతి సభలో మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశానికి సంక్షేమ పథకాలను మార్గదర్శనం చేసిన దార్శనికుడు నందమూరి తారక రామారావు అని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు 29వ వర్ధంతి కార్యక్రమం టిడిపి కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. పేదలకు పట్టెడన్నం పెట్టిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని, సామాన్యులకు సగం ధరకే జనతా వస్త్రాలు కట్టబెట్టిన అసామాన్యుడు అని కొనియాడారు. ఎన్‌టిఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ ప్రజాశ్రేయస్సుకు, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. పేదవారికి సైతం అండగా నిలబడి ఎన్‌టిఆర్ రాజకీయ అవగాహన కల్పించారని అన్నారు. ఎమ్మెల్సీలు పి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు, వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు తదితరులు ఎన్‌టిఆర్ గురించి మాట్లాడారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన మంత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.

గ్రీవెన్స్ నిర్వహించిన అనిత, అశోక్‌బాబు

హోంమంత్రి అనిత, ఎమ్మెల్సీ పి అశోక్ బాబు టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు.

దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలి

- రైతు సంఘాలతో కేంద్రం చర్చలు జరపాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్లమెంటులో మద్దతు ధరల చట్టం చేయాలని కోరుతూ 54 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి కోరారు. రైతుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం వడ్డేశ్వరం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు డాక్టర్ స్వామినాథన్ సూచించిన సి2ప్లస్50 ప్రకారం పార్లమెంటులో మద్దతు ధరల చట్టం చేయాలని దల్లేవాల్ దీక్ష చేపట్టారని తెలిపారు. రైతుల సమస్యల పట్ల కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, 2011లో పార్లమెంటు సాక్షిగా ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీని అమలు చేయకుండా రైతులను కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని పేర్కొన్నారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని నిరసన చేపట్టిన 74 ఏళ్ల రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ ప్రాణాలు కాపాడాలని కోరారు. కేంద్రం తక్షణమే రైతు సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి పి మధు మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తోందని, రైతుల గురించి ఆలోచించే పనిచేయడం లేదని పేర్కొన్నారు. సమరశీల ఉద్యమాలే బిజెపి విధానాలకు సమాధానమని అన్నారు. ఢిల్లీలో పంజాబ్, హర్యానా రైతులు సాగిస్తున్న ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు నాయకులు వై కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, జొన్నా శివశంకర్, మాగంటి హరిబాబు, పివి ఆంజనేయులు, బలరామ్, శ్రీనివాస్, రాజశేఖర్, రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, హేమలత, వల్లూరు భారతి పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్సులో చెలరేగిన మంటలు

- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-ఉలవపాడు (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం మన్నేటికోట వద్ద జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం తప్పింది. శనివారం తెల్లవారుజామున ఆర్‌టిసి బస్సులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది.

ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి నుంచి తిరువూరు వెళ్తున్న ఆర్‌టిసి లగ్జరీ బస్సు ఉలవపాడు సమీపంలో మన్నేటికోట అడ్డరోడ్డు వద్దకు చేరుకునేసరికి ఇంజన్‌లో మంటలు రావడాన్ని డ్రైవర్ గమనించి వెంటనే బస్సును నిలిపివేశారు. ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందకు దించేశారు. క్రమంగా మంటలు విస్తరించి బస్సు మొత్తం దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 19 మంది ప్రయాణికులు ఉన్నట్లు డ్రైవర్ తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రయివేటు బస్సు
- తండ్రి, కుమార్తె మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- గజపతినగరం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మధుపాడ గ్రామ సమీపంలోని 26వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రంలోని మల్కాజ్‌గిరి నుంచి అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీకి చెందిన బస్సులో 40 మందిని ఫ్రీ మెడికల్ క్యాంపు కోసం విశాఖ జిల్లా తగరపువలస వద్దగల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలిస్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న బస్సు ఉదయం ఆరు గంటల సమయంలో మధుపాడ పాలధార చెరువు వద్దకు వచ్చే సరికి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. దీంతో, బస్సులో ప్రయాణిస్తున్న తండ్రీ కూతుళ్ల శుభ్రతోరాయ్ (35), మోహితరాయ్ (3) అక్కడికక్కడే మృతి చెందారు. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. 108 వాహన సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను అతికష్టంపై బయటకు తీసి గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం తగరపువలసలోని అనిట్స్ మెడికల్ కాలేజీకి తరలించారు. మృతదేహాలను జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించారు. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సు కొంతభాగం లారీ తొట్టిలోకి దూసుకుపోవడంతో జెసిబి సహాయంతో బయటకు తీశారు. ప్రమాద సంఘటన తెలిసిన ఎస్ఐ కె.లక్ష్మణరావు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిఎం వస్తేనే రహదారి

- లేదంటే అతుకుల బొంతేమరి
- మంత్రి ఇలాకాలోనూ ఇదే దుస్థితి

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఔను...! సిఎం వస్తేనే రహదారిలో గుంతలు పూడ్చివేత.. లేదంటే అతుకుల బొంతలే. ఇందుకు మంత్రి ఇలాకాలోని గజపతినగరం-మెంటాడ రహదారి నిలువెత్తు నిదర్శనం. ఈ ఒక్కటే కాదు... గత నవంబరులో అట్టహాసంగా చేపట్టిన రహదారి గుంతల పూడ్చివేత కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. దీంతో, సంక్రాంతి సమయంలో సొంతూళ్లకు వెళ్లే వారంతా నానా తంటాలు పడాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, అంతర్ జిల్లా, రాష్ట్ర రహదారుల పూడ్చివేత పనుల శంకుస్థాపన కార్యక్రమానికి గత నంవంబరు 2న సిఎం రాక నేపథ్యంలో ఎంతో హడావుడి చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొత్తం 884 కిలోమీటర్ల పరిధిలోని 176 పనులకు రూ.23.54 కోట్ల మేర కేటాయించినట్టు చెబుతున్నారు. ఇప్పటివరకు 296 కిలోమీటర్ల పరిధిలోనే గుంతల పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. 68 పనులకు రూ.10.54 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. గుంతల పూడ్చివేత పనుల ప్రారంభోత్సవానికి చేసినంత హడావుడి, వాటిని పూడ్చేందుకు మాత్రం చూపలేదు. గజపతినగరం-మెంటాడ రహదారి ఇందుకు సాక్షీ భూతం. గత ఏడాది నవంబర్ 2న పాట్ హోల్ ఫ్రీ రహదారులే లక్ష్యంగా సుమారు రూ.826 కోట్ల రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న రహదారుల మరమ్మతు పనులను ముఖ్యమంత్రితో ప్రారంభించేందుకు జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయం చేసింది. ఇందులో భాగంగా గజపతినగరం నుంచి మెంటాడ రహదారిలో సుమారు ఆరు కిలోమీటర్ల మేర రూ.37 లక్షలతో తలపెట్టిన రహదారి పనులకు గజపతినగరం మండలం పురిటిపెంట వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. గంగచోళ్లపెంట గ్రామం వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం చేసిన హడావుడి, ఖర్చు ఇంతా అంతా కాదు. దాదాపు రూ.కోటి ఖర్చు అయింది. తీరా, ముందు రోజు రాత్రికే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సిఎం పర్యటన రద్దు అయింది. అయితే, సిఎంతో ప్రారంభించేందుకు తలపెట్టిన రహదారి మరమ్మతు పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో, ప్రజలు కూడా సిఎం వస్తేనే రహదారులు బాగుచేస్తారా? లేదంటే వదిలేస్తారా? అంటూ పెదవి విరిస్తున్నారు. గజపతినగరం, మెంటాడ మండలాల్లో వందల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారి అత్యంత అధ్వానంగా ఉంది. గజానికో గొయ్యి.. అడుక్కో గుంత అన్న చందాన ఉంది. గజపతినగరం నుంచి మెంటాడ వెళ్లాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడితే గోతుల్లో మోకాలు లోతు నీరు చేరి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మిగతా రోజుల్లో వాహనాల రాకపోకలతో దుమ్ము రేగి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత నియోజకవర్గ కేంద్రంలోనే ఇలా ఉందంటే జిల్లాలో ఇంకెలా ఉందో అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లాలోని రహదారులు కూడా ప్రజల విమర్శలకు తగ్గట్టే ఉన్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు కూడా ఛిద్రమయ్యాయి. కొన్ని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారుల గుండా ప్రయాణించేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చీపురుపల్లి, వేపాడ, మెరకముడిదాం, గజపతినగరం మండలాల్లో ఈ దుస్థితి ఉంది. సంతకవిటి మండల కేంద్రం సంతకవిటి నుంచి కొండగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో సంతకవిటి నుంచి శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, కొండగూడెం మీదుగా పాలకొండకు వెళ్లడానికి ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. ఈ రహదారికి 30 ఏళ్లు గడిచినప్పటికీ ఇంతవరకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. వంగర మండలంలోని భాగెంపేట నుంచి నీలయ్యవలస మీదుగా కొండవలస సెంటర్ వరకు ఉన్న రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. సుమారు పది గ్రామాలకు వెళ్లే రోడ్డంతా అధ్వానంగా తయారైంది. రోడ్డు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఆ గ్రామస్తులు రోడ్డు బాగు చేయాలని డ్రోన్ ద్వారా ప్లకార్డు ప్రదర్శించి, నిరసన తెలిపారు. భోగాపురం మండలం గూడెపువలస నుంచి రెడ్డికంచేరు వరకు వెళ్లే వాహనదారులు ప్రమాదకరంగా ప్రయాణించాయి. గూడెపువలసలో మరి దారుణంగా తయారైంది. ప్రధానంగా ఈ రహదారిలో విమానాశ్రయానికి సంబంధించిన భారీ వాహనాలు వెళ్లడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం తలపెట్టిన రహదారుల్లో సగానికి సగం రోడ్ల మరమ్మతులు కూడా పూర్తి కాలేదు. దీంతో, పండగ పూట అత్తారిళ్లకు వెళ్లిన అల్లుళ్లకు రహదారి పొడవునా గుంతలు స్వాగతం పలికాయి. వాటిని తప్పించుకుంటే వెళ్లినవారు కొందరైతే, ఒక గోతిని తప్పించబోయి మరో గోతులో పడినవారు మరికొందరు. ఓహో ఇదేనా సర్కారు వారి గుంతల బాగోతం అంటూ జనం చర్చించుకుంటున్నారు.



గజపతినగరం మండలం పురిటిపెంటలో అధ్వానంగా తయారైన రహదారి

గెలిచేదెలా?

ఢిల్లీలో సిఎం పీఠం కోసం మూడు పార్టీల కసరత్తు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దాదాపు 11 ఏళ్లుగా ఢిల్లీని ఏలుతున్న అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి విజయం సాధించాలనే లక్ష్యంతో దూసుకుపోతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ఢిల్లీలో వరుస ఓటములు చవిచూసిన బిజెపి ఎలాగైనా గెలిచితీరాలని శక్తులన్నీ ఒడ్డుతోంది. ఆప్ రావడంతో క్షేత్రస్థాయిలో బలం కోల్పోయిన కాంగ్రెస్ తన ప్రాబల్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం చేస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కాం ఆప్‌కు ప్రతికూలంగా కనిపించినప్పటికీ, ఆప్ సర్కార్ ప్రజా పాలనకు ఓటర్లు మొగ్గుచూపుతున్నారు. 70 అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ప్రజల తీర్పు వెల్లడి కానుంది.

బిజెపికి అదే ఫస్ట్ అండ్ లాస్ట్

ఢిల్లీలో 1993లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన బిజెపి, ఐదేళ్లలో ముగ్గురిని ముఖ్యమంత్రులుగా మార్చింది. ఢిల్లీలో.. ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకోవటం బిజెపికి అదే మొదటి, చివరిసారి. 1998 నుంచి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి వరుసగా ఐదుసార్లు ఓటమి చవిచూసింది. 1998లో షీలా దీక్షిత్ కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రి అయ్యారు. అక్కడ నుంచి వరుసగా మూడు సార్లు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. ఆ తర్వాత 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మిగతా పార్టీల కంటే అత్యధికంగా 31 స్థానాలు దక్కించుకున్నా.. అప్పటి రాజకీయ సమీకరణాలలో భాగంగా అవినీతి అంతమే లక్ష్యంగా రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టిన ఆప్‌నకు సిఎం పీఠం దక్కింది. సిఎంగా కేజ్రీవాల్ తొలిసారి బాధ్యతలు తీసుకున్నారు. విస్పష్ట మెజారిటీ కావాలంటూ.. రాజీనామా చేసి, మళ్లీ ఎన్నికలకు వెళ్లారు. 2015లో జరిగిన ఎన్నికల్లో ఆప్.. భారీ విజయాన్ని సొంతం చేసుకున్నది. 70 అసెంబ్లీ సీట్లకు గానూ.. ఆప్ 67 సీట్లను కైవసం చేసుకోగా.. బిజెపికి మూడు సీట్లే దక్కాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 62 సీట్లతో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పీఠాన్ని నిలుపుకున్నారు. బిజెపి ఎనిమిది స్థానాలను దక్కించుకున్నది.

ఆ స్థానాల్లో విజయం సాధించలేని కమలం పార్టీ

ఢిల్లీ అసెంబ్లీకి 1993 నుంచి 2020 వరకు.. మొత్తం ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆప్, కాంగ్రెస్ మూడుసార్లు చొప్పున, బిజెపి ఒకసారి సిఎం పీఠాన్ని దక్కించుకున్నాయి. 70 స్థానాల్లో 12 ఎస్‌సి రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. 58 జనరల్ స్థానాలు ఉన్నాయి. 12 రిజర్వ్‌డ్ స్థానాల్లోనూ, ముస్లిం మైనార్టీలు నిర్ణయాత్మక పాత్ర పోషించే ఎనిమిది స్థానాల్లో... మొత్తంగా 20 స్థానాల్లో 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బిజెపి గెలుచుకోలేకపోయింది. ఆ 12 సీట్లలో మాటియా మహల్, బల్లిమారన్, అంబేద్కర్ నగర్, సీలంపూర్, ఓఖ్లా, సుల్తాన్‌పూర్ మజ్రా, మంగోళ్‌పురి, జంగ్‌పురా, డియోలిలు ఉన్నాయి. సుల్తాన్‌పూర్ మాజ్రా, అంబేద్కర్ నగర్, డియోలి, మంగోల్‌పురి, కోండ్లి ఎస్‌సి రిజర్వ్ స్థానాలు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపటంతో.. ఇక్కడి రిజర్వ్‌స్థానాల్లో విజయంపై ఢిల్లీ బిజెపి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆప్, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాల్లో ఆయుధంగా మలుచుకుంటున్నాయి. దీంతో ఢిల్లీలోని ఇతర ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలోనూ బిజెపికి తీవ్ర నష్టం కలగక మానదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇక మిగిలిన ఏడు నియోజవర్గాలలో ముస్లిం జనాభా గణనీయమైన సంఖ్యలో ఉన్నది. హిందూత్వ సిద్ధాంతంతో వెళ్లే బిజెపికి ఈ స్థానాలు కూడా గెలవటం చాలా కష్టమని చెప్తున్నారు. "పార్టీ 30కి పైగా అసెంబ్లీ స్థానాల్లో దూకుడుగా ప్రచారం నిర్వహిస్తున్నది. వాటిలో 12 రిజర్వ్ సీట్లు ఉన్నాయి. ఇందులో కొన్నింటిని బిజెపి ఎప్పుడూ గెలవలేదు" అని ఢిల్లీ బిజెపి ఎస్‌సి మోర్చా అధ్యక్షుడు మోహన్‌లాల్ గిహారా అన్నారు. 2008లో ఉనికిలోకి వచ్చిన న్యూఢిల్లీ స్థానాన్నైతే బిజెపి ఇప్పటి వరకూ దక్కించుకోలేదు.

మురికివాడల్లో నివసించేవారి ఓట్లే కీలకం

ఢిల్లీలోని మురికివాడల్లో నివసించేవారి ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. వీరి సంఖ్య దాదాపు 20 లక్షలు ఉంటుందని అంచనా. వీరు సాంప్రదాయకంగా, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ హయాంలో కాంగ్రెస్‌కు మద్దతుదారులు. మొహల్లా క్లినిక్‌లు, విద్యుత్, నీటి బిల్లుల తగ్గింపు, ప్రాథమిక సౌకర్యాలను అందించటం వంటి లక్ష్య విధానాల ద్వారా ఆప్ వారిని తనవైపునకు తిప్పుకోగలిగిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మూడు పార్టీలు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని ఎంపి సీట్లను దక్కించుకుంటున్న బిజెపి అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిపోతున్నదని గుర్తు చేస్తున్నారు. బిజెపికి రాష్ట్రంలో ప్రజాదరణ కలిగిన నేతలేరు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముఖంతోనే బిజెపి ఎన్నికలకు వెళ్తుంది. రైతుల ఆందోళన బిజెపికి నష్టం చేయొచ్చు. ఎందుకంటే ఢిల్లీలో సిక్కుల ప్రభావం ఎక్కువ ఉంటుంది. కాంగ్రెస్‌కు కూడా సరైన నాయకత్వం లేకపోవడంతో ఆ పార్టీకి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలే దిక్కుగా ఉన్నారు.

ఆకట్టుకోని బిజెపి మతోన్మాద ప్రచారం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి మతోన్మాద ప్రచారం ప్రజలను ఆకట్టుకోలేకపోయింది. అందుకనే బిజెపి కూడా సంక్షేమ రాగం పలుకుతుంది. ఏ ఎన్నికల్లోనైనా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి కిందిస్థాయి నేతల వరకు విద్వేష, విభజన, మతోన్మాద పరమైన వ్యాఖ్యలతో ప్రజలను రెచ్చగొట్టేవారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆ స్థాయిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేవు. అయితే ఇటీవల బిజెపి అభ్యర్థి, మాజీ ఎంపి రమేష్ బిందూరి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వంటి మహిళా నేతలపై వివాదాస్పద, అవమానకర వ్యాఖ్యలు చేశారు. ఇది ఆ పార్టీకి పెద్ద నష్టాన్ని తెచ్చిపెడుతోంది. మహిళా ఓటర్లలో ఈ అంశం చర్చనీయాంశమైంది.

కేజ్రీవాల్ కారుపై దాడి

- బిజెపి గూండాల పనే : ఆప్
- అద్దెదారులకు విద్యుత్, తాగునీరు ఉచితం : కేజ్రీవాల్ హామీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో ఆప్ కన్వీనర్, మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై శనివారం దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. ఇది బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మకు చెందిన గూండాల పని అని ఆప్ ఆరోపించింది. దీనిని పర్వేష్ వర్మ ఖండించారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ఉన్న కారుపై రాళ్లు విసిరారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపేశారు. కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. 'ఓటమి భయంతో బిజెపి ఆందోళన చెందుతోంది. కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బిజెపి వ్యక్తుల పిరికి దాడికి కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది. ఆప్ ఆరోపణలను బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు. అరవింద్ కేజ్రీవాల్ వాహనం ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు.

కేజ్రీవాల్ మరో హామీ

కేజ్రీవాల్ మరో ఎన్నికల హామీ ప్రకటించారు. ఢిల్లీలో నివసించే అద్దెదారులకు విద్యుత్, తాగునీరు ఉచితంగా అందిస్తామని తెలిపారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మేం ఢిల్లీ నివాసితులకు ఉచిత విద్యుత్, ఉచిత తాగునీరు అందించాం. అద్దెదారులకు ఈ ప్రయోజనాలు లభించలేదు. నేను ఎక్కడికి వెళ్ళినా, అద్దెకు నివసిస్తున్న వారిని నేను కలుస్తున్నాను. వారు మంచి పాఠశాలలు, ఆస్పత్రుల నుండి ప్రయోజనం పొందుతున్నారని చెబుతున్నారు. కానీ ఉచిత విద్యుత్, నీటి పథకాలకు దూరంగా ఉన్నారు. కనుక ఎన్నికల తరువాత మా ప్రభుత్వం ఏర్పడితే, అద్దెదారులకు కూడా ఉచిత విద్యుత్, తాగునీరు అందించే వ్యవస్థను ప్రవేశపెడతాం' అని అన్నారు.

తేజస్వికి ఆర్‌జెడి పగ్గాలు



పాట్నా : తేజస్వియాదవ్‌కు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) పగ్గాలు అప్పగించారు. శనివారం పాట్నాలో నిర్వహించిన ఆర్‌జెడి జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రస్తుతం లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన కుమారుడు, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న తేజస్వీయాదవ్‌కు కీలక బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ పేర్కొంది. తేజస్వీయాదవ్ పార్టీ టిక్కెట్, గుర్తుల సవరణలకు సంబంధించిన కీలకమైన నిర్ణయాలు తీసుకోవచ్చని తీర్మానం పేర్కొంది. లాలూప్రసాద్ యాదవ్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా లాలూప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ 'ఆర్‌జెడి ఏర్పడిన సోషలిజం, లౌకికవాదం, సామాజిక న్యాయం సూత్రాలను ముందుకు తీసుకెళ్లేందుకు తేజస్వి ప్రయత్నించడం ఆనందంగా ఉంది. ఎన్నికలు దగ్గరపడ్డాయి. ఇప్పుడే మీ సన్నాహాలు ప్రారంభించండి' అని ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా తేజస్వి యాదవ్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి నేతృత్వంలో మహాకూటమి కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అపరిమిత నిఘా అధికారాలు

- కీలక వ్యక్తిగత సమాచారం కూడా..!
- ఆందోళన కలిగిస్తున్న ముసాయిదా నిబంధనలు
- అమలు, పారదర్శకతపై సందేహాలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ నెల 3న వ్యక్తిగత సమాచార రక్షణకు సంబంధించి విడుదల చేసిన ముసాయిదా నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి అపరిమిత నిఘా అధికారాలు సంక్రమిస్తాయి. ఈ నిబంధనలను సమాచార రక్షణ కోసమే ఉద్దేశించినప్పటికీ అమలు, పారదర్శకత విషయంలో సందేహాలు తలెత్తుతున్నాయి. 2023లో ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులోని సెక్షన్ 36 ప్రకారం ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చు. ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలకు రూల్ 22 మరింత పదును పెట్టింది. దీని ప్రకారం వ్యక్తుల అనుమతి పొందకుండానే కంపెనీల నుండి కీలకమైన వ్యక్తిగత సమాచారాన్ని కోరే హక్కు కేంద్రానికి దఖలు పడుతుంది. దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతా ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చునని నిబంధనలు చెబుతున్నాయి. ఎలాంటి పరిమితులు లేకుండా, స్పష్టత లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యక్తుల సమాచారాన్ని తీసుకునేందుకు ఇవి వీలుకల్పిస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించుకోవచ్చు. అందుకోసం ప్రభుత్వం నియమించిన అధికారులు ఎలాంటి అభ్యర్థనలు, లిఖితపూర్వక విజ్ఞాపనలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నియమించే ఏజెంట్లు తమ ఇష్టానుసారం వ్యక్తుల కీలక సమాచారాన్ని డిమాండ్ చేయవచ్చు. ఇది ప్రజలకు ఉన్న గోప్యత హక్కును హరిస్తుందని, అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఏదైనా సమాచారం దేశ భద్రత, సార్వభౌమత్వానికి భంగకరమని ప్రభుత్వం భావిస్తే దానిని ప్రభుత్వం బయటపెట్టాల్సిన అవసరం లేదని రూల్ 22 చెబుతోంది. ఏదైనా సమాచారాన్ని కోరాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉన్నదా లేదా అలా కోరడం చట్టబద్ధమేనా అని పరిశీలించే యంత్రాంగం ఏదీ ఉండదు. కాబట్టి ప్రభుత్వం ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకోవచ్చు. అవసరానికి మించిన సమాచారాన్ని సైతం ప్రభుత్వం సేకరించవచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని కోరినప్పుడు దానిని సవాలు చేసేందుకు వ్యవస్థ అంటూ ఏదీ ఉండదు.

ఇరాన్‌లో ఇద్దరు న్యాయమూర్తుల హత్య

దుబాయ్ : ఇరాన్ రాజధాని టెహరాన్‌లో శనివారం ఇద్దరు న్యాయమూర్తులను ఒక వ్యక్తి కాల్చివేశాడని అధికారులు తెలిపారు. చేతి తుపాకీతో ఈ దాడికి దిగిన ఆ దుండగుడు తర్వాత తనను తాను కాల్చుకుని, ఆత్మహత్య చేసుకున్నాడని ప్రభుత్వ వార్తా సంస్థ ఇర్నా తెలిపింది. ఈ చర్యకు తమదే బాధ్యత అని ఇంతవరకు ఏ గ్రూపు ప్రకటించలేదు. టెహరాన్‌లో జస్టిస్ ప్యాలెస్ వద్ద జరిగిన ఈ దాడిలో ఒక న్యాయమూర్తి అంగరక్షకుడు కూడా గాయపడ్డారు. దాడి చేసిన ఆ వ్యక్తికి సుప్రీం కోర్టులో గానీ, మరే ఇతర కోర్టుల్లో గానీ ఎలాంటి కేసులు లేవని ప్రాథమిక విచారణలో తేలింది. 1988లో మూకుమ్మడి అసమ్మతివాదుల ఉరితీత కేసులో ఈ న్యాయమూర్తు లకు పాత్ర వుంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి చొరబాటుదారుడని న్యాయవ్యవస్థ ప్రతినిధి జహంగీర్ తెలిపారు. కాల్పులు జరిగిన కోర్టు హౌస్‌లోనే ఆ వ్యక్తి పనిచేస్తున్నాడని కూడా చెప్పారు.

మాటలు కాదు, చేతలు కావాలి!

- నితిన్ గడ్కరీ వ్యాఖ్యలపై ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ప్రకటన

న్యూఢిల్లీ : కాంట్రాక్టర్లు రహదారులను లోపభూయిష్టంగా నిర్మిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని, అయినా వారిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన ప్రకటనను అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య స్వాగతించారు. గత పదేళ్లుగా ఆయనే సంబంధిత శాఖ మంత్రిగా కొనసాగుతున్నందున ముందుగా ఆయన అందుకు నైతిక బాధ్యత వహించి, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో సిఐఐ నిర్వహించిన రహదారుల భద్రతా కార్యక్రమాన్ని ఈనెల 16న మంత్రి ప్రారంభిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. లోపభూయిష్టంగా రహదారులు నిర్మించడాన్ని నాన్ బెయిలబుల్‌గా చేయాలని, సదరు కాంట్రాక్టర్లను, ఇంజనీర్లను జైలుకు పంపాలని ఆయన వ్యాఖ్యానించినట్లు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఒకే శాఖను గత పదేళ్లుగా నిర్వహిస్తున్న మంత్రి కనీసం ఇప్పటికైనా ఈ వాస్తవాన్ని గ్రహించినందుకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కృతజ్ఞతలు చెబుతోందని లక్ష్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తే అడ్డుకునేవారు ఎవరూ వుండరని అన్నారు. పైగా ప్రభుత్వాన్ని అభినందిస్తారని చెప్పారు. ఇన్నాళ్లు ఈ దిశగా ఎందుకు చర్యలు చేపట్టలేదని లక్ష్మయ్య ప్రశ్నించారు. తానన్న వ్యాఖ్యల పట్ల మంత్రి సీరియస్‌గా వ్యవహరిస్తే, వెంటనే నిష్పక్షపాతంగా, స్వేచ్ఛా, సక్రమ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడి ప్రమాదాలకు, ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన వారికి కఠినంగా శిక్షలు విధించాలన్నారు. మెజారిటీ రోడ్డు ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయని ఇటీవల ఎంఒఆర్‌టిహెచ్ విడుదల చేసిన డేటా వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని మోడీ సర్కార్ రుజువు చేయాలని లక్ష్మయ్య పేర్కొన్నారు.

సైఫ్‌పై దాడి నిందితుల కోసం ముమ్మర గాలింపు

ముంబయి : ప్రముఖ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో నిందితుల కోసం ముంబయి పోలీసులు గాలిస్తున్నారు. 40 బృందాలను ఏర్పాటు చేశారు. అనుమానితులందరినీ ప్రశ్నిస్తున్నారు. సిసి టివి పుటేజి ఆధారంగా దర్యాప్తు ముమ్మరంగా జరుపుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఆయన సైఫ్ అని తెలీదు : ఆటో డ్రైవర్

తన ఆటోలో లీలావతి ఆస్పత్రికి తరలించిన వ్యక్తి బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ అనే విషయం తనకు తెలియదని డ్రైవర్ భజన్ సింగ్ చెప్పారు. ఖర్ (ఈస్ట్)లోని పైప్‌లైన్ రోడ్డులో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న భజన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ రక్తస్రావంతో గాయపడిన వ్యక్తిని దగ్గరి దారిలో ఆస్పత్రికి తీసికెళ్లి ప్రాణాలు కాపాడేలా చేయాలన్నదే తన ఆలోచన అని, ఆయన ఓ సెలబ్రిటీ అనే విషయం తనకు అప్పుడు తెలియదని చెప్పారు. ఆటోలో సైఫ్ స్పృహలోనే ఉన్నారని, ఆస్పత్రికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందని పదే పదే ప్రశ్నించారని తెలిపారు. 'రెండు నిమిషాలు పడుతుందని నేను చెప్పాను. సైఫ్ వెంట ఆయన కుమారుడు తైమూర్, సహాయకుడు హరి ఉన్నారు. ఆయన భయపడడం లేదు. ఆయన బట్టలన్నీ రక్తంతో తడిసిపోయాయి. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి బాలీవుడ్ నటుడని మొదట్లో నాకు తెలీదు. సాధ్యమైనంత త్వరగా లీలావతి ఆస్పత్రికి చేరుకోవాలన్నదే నా లక్ష్యం. వారు అలాంటి అత్యవసర పరిస్థితిలో ఉన్నారు. ఆటో ఛార్జీ అడగకుండా అడ్డుకున్నారు కూడా. అలాంటి పెద్ద నటుడు నా వాహనంలో కూర్చోవడమే నాకు పెద్ద సంతృప్తి' అని భజన్ సింగ్ వివరించారు.

ట్రంప్ ప్రమాణం రేపే!

- 40ఏళ్లలో తొలిసారిగా కేపిటల్ లోపల ప్రమాణ స్వీకారం



వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ (78) 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. లాంఛనంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగిన అనంతరం సంగీత ప్రదర్శనలు, పరేడ్‌తో సహా పలు కార్యక్రమాలు జరగనున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12గంటలకు ప్రమాణ స్వీకారం జరుగుతుంది. ట్రంప్‌చే చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయిస్తారు. దీంతో ట్రంప్ రెండో పదవీ కాలం ఆరంభమవుతుంది. సోమవారం ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి అంటే మైనస్ ఏడు డిగ్రీలకు పడిపోయే అవకాశముందని వాతావరణ హెచ్చరికలు వెలువడడంతో సాంప్రదాయంగా ఆరుబయట జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కేపిటల్ రొటుండా లోపల నిర్వహించనున్నారు. ఇలా వేదిక మారి లోపల కార్యక్రమం నిర్వహించడమనేది 40ఏళ్లలో మొదటిసారి. చివరిసారిగా 1985లో ఇక్కడ అప్పటి అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన కూడా అప్పుడు రెండోసారి ఎన్నికయ్యారు. వాతావరణం అనుకూలించనందునే అప్పుడు కూడా లోపల నిర్వహించారు. అధ్యక్షుడు జో బైడెన్, కాంగ్రెస్ సభ్యులు, ఇతర ప్రముఖులు, ఆహూతులు, అతిథులు కేపిటల్ లోపల కూర్చుని చూసేందుకు వీలుగా వేదిక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదివారం ఉదయం అర్లింగ్టన్ నేషనల్ సిమెట్రీలో అజ్ఞాత సైనికుని సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఆరంభమవుతాయి. తర్వాత విక్టరీ ర్యాలీ జరగనుంది. ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆనాడు కేపిటల్‌పై దాడి చేసిన నిందితులు కూడా హాజరు కానున్నారు. కోర్టు అనుమతినివ్వడంతో వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

ఘనంగా ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీసిటీ, జీవవైవిధ్యానికి కార్పొరేట్ సహకారం, సుస్థిరత, ఎకో-టూరిజం అంశాలలో వినూత్న ఆలోచనలు రేకెత్తించే సదస్సులకు వేదికగా నిలిచింది. సూళ్లూరుపేటలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శ్రీసిటీ ప్రగతిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్పొరేట్ సామాజిక భాధ్యత (సిఎస్‌ఆర్) సదస్సులో కార్పొరేట్ చొరవ ద్వారా పర్యావరణ నిర్వహణ, సామాజిక స్పృహ అనే అంశాలపై చర్చించారు. సదస్సులో పలువురు పరిశ్రమల ప్రతినిధులు ప్రసంగిస్తూ ఫ్లెమింగోలతో సహా వలస పక్షుల కోసం ఆవాసాలను రక్షించడానికి పరిశ్రమ-సమాజం, సహకారం ప్రాముఖ్యతను ప్రస్తావించారు. స్థానిక కియోస్కో విశ్వవిద్యాలయంలో జీవవైవిధ్యం, చిత్తడి నేలల సంరక్షణపై రెండు రోజుల సమావేశం బిఎన్‌హెచ్‌ఎస్‌కు చెందిన డాక్టర్ సత్య సెల్వం అధ్యక్షతన ప్రారంభమైంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, పక్షి శాస్త్ర నిపుణుల భాగస్వామ్యంతో జరిగిన ఈ సమావేశంలో పులికాట్ సరస్సు పర్యావరణ ప్రాముఖ్యతను ప్రముఖంగా చర్చించారు. వృక్ష, జంతు వైవిధ్యం, మత్స్య, పర్యాటక ప్రయోజనాలు, హైడ్రోలాజికల్ డైనమిక్స్, వాతావరణ మార్పు ప్రభావాలు, కాలుష్యం తగ్గించడం, స్థిరమైన పద్ధతులు, పరిరక్షణ ప్రయత్నాలలో సమాజ భాగస్వామ్యం గురించి కీలక చర్చలు జరిగాయి. ప్రారంభోత్సవ సభలో మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, ఆర్‌డిఓ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ రాయ్ దోషి!

(మొదటి పేజీ తరువాయి)

సంహితలోని సెక్షన్లు 64, 66, 103(1) కింద నిందితుడిని దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి దాస్ చెప్పారు. కోర్టు గదిలో తీర్పు చదువుతుండగా, కాగా తాను ఈ నేరం చేయలేదంటూ సంజయ్ రాయ్ కోర్టులో చెప్పాడు. "నేను ఇది చేయలేదు. ఇలా చేసిన వారు వున్నారు, వారినెందుకు పట్టుకోలేదు?" అని ప్రశ్నించాడు. శిక్ష విధించే ముందు సోమవారం మాట్లాడేందుకు అవకాశమిస్తామని సంజయ్ రాయ్‌కు న్యాయమూర్తి చెప్పారు.

తీర్పు చెప్పిన వెంటనే బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు గదిలోనే కన్నీటి పర్యంతమయ్యారు. 'మేం మీపై వుంచిన విశ్వాసానికి తగ్గట్టుగా మీరు వ్యవహరించారు.' అని బాధితురాలి తండ్రి వ్యాఖ్యానించారు. తీర్పు వెలువడేందుకు ముందు కోర్టు వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రజలు గుమిగూడేందుకు పోలీసులు అనుమతినివ్వనప్పటికీ సీల్దా కోర్టు కాంప్లెక్స్ వెలుపల పెద్ద సంఖ్యలో జనాలు మూగారు. కోర్టు తీర్పు కోసం వారు ఆతృతగా ఎదురుచూడడం కనిపించింది. ఈ నేరానికి సంజయ్ రాయ్ ఒక్కడే బాధ్యుడని తాము విశ్వసించడం లేదని అక్కడ గుమిగూడిన జనాల్లోని జూనియర్ డాక్టర్లు వ్యాఖ్యానించారు.

తొలుత ఈ నేరాన్ని కప్పిపుచ్చడానికి పశ్చిమ బెంగాల్ పోలీసులు ప్రయత్నిస్తున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. దాంతో పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసులు సిబిఐకి బదిలీ చేశారు. పోలీసు వలంటీర్, ప్రధాన నిందితుడైన సంజయ్ రాయ్ పేరును మాత్రమే చార్జిషీట్‌లో పేర్కొంటూ అక్టోబరు 7న సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. సామూహిక అత్యాచారం అన్న అంశాన్నే ఆ ఛార్జిషీట్‌లో ప్రస్తావించలేదు. ఆగస్టు 9వ తేదీన ఆస్పత్రిలోని సెమినార్ రూమ్ నుండి బాధితురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిసిటివి ఫుటేజ్ ప్రాతిపదికన 10వ తేదీన కోల్‌కతా పోలీసులు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు. తర్వాత కేసు సిబిఐకి బదిలీ అయింది. సాక్ష్యాధారాలు కింద 11 వస్తువులను సిబిఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది. వీటిని చూస్తుంటే ఈ నేరంలో సంజయ్ రాయ్ పాత్ర వుందని నిర్ధారించబడుతోందని పేర్కొంది. సిసిటివి ఫుటేజ్ చూసినట్లైతే సంజయ్ రాయ్ సంఘటనా స్థలంలోకి రావడం వెళ్ళడం కనిపిస్తోంది.

ఆస్పత్రిలో రాత్రిపూట విధుల్లో వున్న జూనియన్ వైద్యురాలిపై ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కోల్‌కతా సహా రాష్ట్రవ్యాప్తంగానూ, దేశవ్యాప్తంగానూ విస్తృతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంఘటన జరిగిన తర్వాత కూడా పశ్చిమ బెంగాల్‌లో నెలల తరబడి నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి. ఈ కేసులో ఆర్‌జి కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్‌చార్జి అభిజిత్ మండల్‌లను కూడా తొలుత అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకోవడంలో జాప్యం చేశారని అభియోగాలు కూడా వారిపై నమోదు చేశారు. అరెస్టయిన 90 రోజుల్లో వారిపై అనుబంధ చార్జిషీట్‌ను నమోదు చేయకపోవడంతో ప్రత్యేక న్యాయస్థానంలో వారికి బెయిల్ లభించింది.

మిగిలినవారి సంగతేంటి? : బాధితురాలి తల్లి

దర్యాప్తు సగమే పూర్తయిందని బాధితురాలి తల్లి వ్యాఖ్యానించారు. ఈ నేరంలో పాలుపంచుకున్న వారిలో ఇంకా చాలామంది స్వేచ్ఛగా తిరుగుతున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు.

సంజీవనిగా 21ఎంపి సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

స్టీల్‌ప్లాంట్ వస్తే ప్రగతి పరుగులు పెడుతుందని తెలిపారు. రాజోలి జలాశయం నిర్మాణ పనులను పూర్తి చేసి, 90 వేల ఎకరాలకు నీళ్లిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ విజ్ఞప్తి మేరకు సభాముఖంగా చంద్రబాబు ప్రకటించారు. అనంతరం మైదుకూరులోని వినాయక నగర్‌కు చెందిన గృహిణి వందన ఇంటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. చెత్త వ్యర్థాల నుంచి పంటలు పండించిన కడపకు చెందిన అలైక్య, మున్సిపల్ కార్మికులు అమ్ములమ్మ, గంగాధర్, అనకాపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌లకు లక్ష రూపాయల నగదు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, సి.ఆదినారాయణరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి తతదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు

(మొదటిపేజీ తరువాయి)

కొన్నేళ్లుగా సిపిఎం, వామపక్షాలు బలోపేతం కావటం లేదని, కనుక తమ బలహీనతలను అధిగమించేందుకు పార్టీ మహాసభలో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. శ్రామికవర్గ పోరాటం, వివిధ వర్గాల ప్రజల ఉద్యమాలపైన, అలాగే ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రపంచంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై పార్టీ మహాసభ చర్చిస్తుందని తెలిపారు. అమెరికాలో ట్రంప్ వచ్చిన తరువాత సామ్రాజ్యవాద దాడి మరింత పెరుగుతోందని విమర్శించారు. ప్రపంచంలో పురోగతి సాధిస్తోన్న చైనా, అమెరికాకు సవాల్‌గా మారిందని, అందువల్ల చైనాను అమెరికా టార్గెట్ చేస్తోందన్నారు. పాలస్తీనా, గాజాపై దాడులు చేస్తోన్న ఇజ్రాయిల్‌కు అమెరికా సామ్రాజ్యవాదం ఎలా మద్దతుగా నిలుస్తోందో అందరికి తెలుసని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తోన్న ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం చేస్తోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తులకు వ్యతిరేకంగా బలమైన వామపక్ష ఉద్యమం ఐక్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే దేశంలోనూ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు ఐక్యంగా ముందుకు సాగుతామన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెస్తామని తెలిపారు. ఇదే 24వ పార్టీ అఖిల భారత మహాసభ ప్రధానమైన అజెండా అని ప్రకాశ్ కరత్ తెలిపారు.

ప్రైవేట్ వలయంలో పారిశ్రామిక రంగం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ రంగం పాత్ర గురించి నొక్కి చెప్పింది. చంద్రబాబు ప్రభుత్వం దీనికి భిన్నంగా ప్రైవేటు పాట పాడుతోంది. సంస్కరణల గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా చైనా ను చూడండి అని చెప్పే మన పాలకులు అక్కడ పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వ రంగమే వెన్నెముకగా ఉందన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తుంటారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాక దానికి అనుబంధంగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు అనేకం వచ్చాయి. వేలాది మందికి ఉపాధి లభించింది. అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగయ్యాయి. అటువంటి భారీ పరిశ్రమ లు ఈ నయా ఉదారవాద విధానాల కాలంలో ఒక్కటైనా రాష్ట్రంలో నెలకొల్పగలిగామా? విభజన చట్టం హామీల్లో భాగంగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాల్సి ఉంది. చంద్రబాబుకు కేంద్రంలో ఉన్న పరపతిని ఉపయోగించి వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఎంతగానో దోహద పడే ఉక్కు ఫ్యాక్టరీ సాధించవచ్చు కదా? ఆ ప్రయత్నమూ చేయలేదు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రావడానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఆ పని చేయలేదు. రాష్ట్రానికి అడుగడుగునా ద్రోహం చేసిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ, రాష్ట్రంలో గత పదేళ్లలో ఇన్ని లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చాం అని అంకెల గారడీతో ప్రజలను మభ్యపుచ్చుతున్నారు. ప్రభుత్వం వచ్చాయని చెబుతున్న 1.4 లక్షల కోట్ల పెట్టుబడుల్లో 36 శాతం దాకా పెట్రో కెమికల్స్ రంగానికి చెందినవే. వీటిలో చాలావరకు ప్రభుత్వ రంగ సంస్థ పెట్టిన పెట్టుబడులేనన్న సంగతి మరువరాదు. ఉపాధి కల్పనలో ముఖ్యమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లోకి కూడా ఈ కాలంలో పెట్టుబడులు పెద్దగా వచ్చిందేమీ లేదు. 28 ఎక్స్‌క్లూజివ్ ఎంఎస్‌ఎంఇ పార్కులకు 1378 ఎకరాల భూమి కేటాయించారు. అక్కడ ఇప్పటివరకు 64 శాతం ఎంటర్‌ప్రైజెస్ మాత్రమే వచ్చాయి. రూపాయి విలువ పతనం, అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్య నెలకొన్న స్థితిలో ఎగుమతులు మరింత మందగించడం, పెట్టుబడులు వెనక్కిపోతుండడం వంటి బాహ్య పరిస్థితులను బొత్తిగా పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్‌జిడిపి)ని డబుల్ డిజిట్‌కు చేర్చుతామని ప్రకటించడం వాస్తవికత అనిపించుకోదు.

దేశంలోనే మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు కలిగి ఉన్న ఏకైక రాష్ట్రం ఎపినే అని పత్రంలో గొప్పగా పేర్కొన్నారు. వీటిలో మన రాష్ట్ర పరిధిలో ఉన్నది విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఒక్కటే మిగతా రెండు (హైదరాబాద్ -బెంగళూరు, చెన్నై -బెంగళూరు) ఇతర రాష్ట్రాల పరిధిలో ఉన్నాయి. విశాఖ -చెన్నై కారిడార్ లో వచ్చే వాటిలో ఫార్మా, ఆక్వా వంటి కాలుష్య కారక పరిశ్రమలే ఎక్కువ. ప్రైవేట్ పరిశ్రమల్లో ఈ మధ్య ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. దీనికి కారణం పరిశ్రమ యాజమాన్యానికి లాభం పై ఉన్న శ్రద్ధ కార్మికుల భద్రతపై లేకపోవడమే. పరిశ్రమల్లో భద్రతకు సంబంధించి యాజమాన్యం సెల్ఫ్ సర్టిఫికెట్ ఇస్తే చాలు అని కొత్త పారిశ్రామిక విధానం పేర్కొంది. దీంతో కార్మికుల భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. ఉపాధి, భద్రత, మెరుగైన వేతనాలు, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి 2047 నాటికి రెండున్నర లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పడం దార్శనికత అనిపించుకోదు.

46,788 మంది బలి, ఇజ్రాయిల్ తాజా దాడుల్లో ఐదుగురి మృతి



కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో చిన్నారుల ఆనందం

జెరూసలేం, గాజా: 460రోజుల పాటు ఇజ్రాయిల్ సైనిక బలగాలు అమెరికా, పశ్చిమ దేశాల మద్దతుతో జరిపిన దారుణ మారణ హోమంలో 46,788మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. 1,10,453 మందిని గాయపరిచిన తర్వాత ఎట్టకేలకు ఇజ్రాయిల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి ఆమోద ముద్ర లభించింది. అయినప్పటికీ, ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతునే వున్నాయి. శనివారం తెల్లవారు జామున జరిగిన దాడిలో ఐదుగురు మరణించారు. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత డ్రోన్‌దాడిలో మరో ముగ్గురు చనిపోయారు.

పాలస్తీనియన్లకు హిజ్బుల్లా అభినందనలు

ఇజ్రాయిల్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్న పాలస్తీనియన్లకు హిజ్బుల్లా నేత నయీమ్ ఖాసిమ్ అభినందనలు తెలిపారు. 2024 మేలో ఏదైతే ప్రతిపాదించబడిందో అదే ఒప్పందం మార్పు లేకుండా ఇప్పుడు కుదిరిందని, దీన్నిబట్టి ఇజ్రాయిల్ తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొన్నట్లు రుజువైందని వ్యాఖ్యానించారు. ఈ దాడుల తర్వాత గాజాలో పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టడానికి పాలస్తీనా అథారిటీ సన్నాహాలు పూర్తి చేసిందని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ తెలిపారు. నిర్వాసితులైన పాలస్తీనియన్లు గాజాకు తిరిగి రావడానికి సమాయత్తమవుతున్నారు.





మీకోసం

నాన్‌వెజ్ కూరల్లో కసూరిమేతి పొడిని వేయడం వల్ల మంచి రుచి వస్తుంది.

జీవన సౌరభం

ఏం చదివాం, ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. చదువు వల్ల సంస్కారం ఏ స్థాయికి చేరిందన్నదే ముఖ్యం.

మన పల్లెలు - పండుగలు



పండుగకు వెళ్లాము
అమ్మమ్మ ఊరు
బోలెడు వింతలకు
పెట్టింది పేరు

వ్యవసాయమే వారి
జీవనాధారం
కాయగూరల పంట
కొంత ఫల సాయం

పంట చేతికి రాగ
ఆనందముల కూడి
అందరూ చేసేరు
మూడు పండుగలు

ఉదయమే చేసాము
భోగి స్నానములు
తాతయ్య వేసాడు
భోగి మంటల్లు

మావయ్య, అత్తయ్య
పిల్లలు వచ్చారు.
సరదాలను పంచి
ఆటలాడారు.

రెండవ రోజున
మకర సంక్రాంతి
రంగుల ముగ్గులతో
ఆనంద కేళి

తియ్యని తాయిలం
తీపి మిఠాయి
అమ్మమ్మ తెచ్చింది
అందరికి పంచింది

కొత్త బట్టలు తొడిగి
కోటి ఆశలు కలిగి
చేసేము సంక్రాంతి
కోటి క్రాంతుల తోటి!

ముచ్చటగ వచ్చింది
మూడవ పండుగ
కమ్మని వంటలతో
కనువిందు చేసింది!

గారెలు, బూరెలు
పాయసం, పొంగలి
పులిహోర, బొబ్బట్లు
ముదమారా తిన్నాము

మూడు పండుగలు
ముచ్చటగ చేసాము.
సెలవలు తీరగా
పయన మయ్యాము

ఏమైన మన పల్లెలు
పండుగకు మరు మల్లెలు
సిరులు పంచెడి తల్లులు
సాంస్కృతిక ప్రభలు

పండుగ జ్ఞాపకం
మరువలేము మేము
ప్రతి ఏడు పండుగకు
పల్లెకు పోతాము!

- కూచిమంచి నాగేంద్ర
91821 27880.



సరైన గుర్తు చెప్పండి

పిల్లలూ, బుజ్జి పాండాలో ఉన్న బొమ్మలు దాని చుట్టూనే ఉన్నాయి. ఏవి ఎక్కడ సరిపోతాయో వాటి అంకెలను సరిగ్గా గుర్తు పెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

- కొమ్మనాపల్లి ప్రణీత్,
5వ తరగతి,
ఎంపీపీఎస్‌వి.
సంతపాలెం,
కె.కోటపాడు మండలం,
అనకాపల్లి జిల్లా.





పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మెనోపాజ్ ... జాగ్రత్తలు అవసరం

12 సంవత్సరాలు దాటిన ప్రతి ఆడపిల్లకు రుతుక్రమం వస్తుంది. అక్కడి నుంచి 50 ఏళ్ల మహిళలు వరకూ ప్రతినెలా రుతుక్రమం (పీరియడ్స్) వస్తుంటాయి. ఆ తర్వాత అవి ఆగిపోవటాన్ని 'మెనోపాజ్'గా పిలుస్తుంటారు. ప్రతి ఆడపిల్లా పుట్టినప్పుడు దాదాపు 10 లక్షల నుంచి 20 లక్షల అండాలు ప్రాథమిక రూపంలో ఉంటాయి. రోజులు గడిచే కొద్దీ ఈ నిల్వలు తగ్గిపోతుంటాయి. రుతుక్రమం ప్రారంభమయ్యే సమయానికి మూడు నుంచి నాలుగు లక్షల అండాలు మాత్రమే మిగులుతాయి. ఇలా ప్రతినెలా కొన్ని అండాలు విడుదలవుతూ మెనోపాజ్ నాటికి ఈ నిల్వ పూర్తిగా తగ్గిపోతుంది. తర్వాత అండాశయాల నుంచి ఇక అండం విడుదల కాదు. వీటితోపాటే హార్మోన్ల విడుదల కూడా ఆగిపోతుంది. మరో రెండేళ్లలో మెనోపాజ్ దశకు వెళ్తామనే క్రమంలోనే శరీరంలో మార్పులు మొదలవుతాయి. హార్మోన్ల స్థాయి కూడా నెమ్మదిగా తగ్గుతుంది. శారీరక మార్పులు అనూహ్యంగా చోటుచేసుకుంటాయి. దాంతో మెనోపాజ్ దశకు చేరుకుంటారు. సాధారణంగా 48 నుంచి 55 సంవత్సరాల లోపు ఈ ప్రక్రియ చోటుచేసుకుంటుందని అంచనా.

అయితే సగటు వయస్సుగా 51 సంవత్సరాలుగా చెప్పుకోవచ్చు. మెనోపాజ్ మరీ 40 కంటే ముందే వస్తే దానిని 'ప్రికాషియస్ మెనోపాజ్' అని అంటారు.

మహిళల జీవితాల్లో మెనోపాజ్ ఇదొక దశ. స్త్రీలలో పునరుత్పత్తి వయస్సు అయిపోయిందనటానికి ఇదొక సంకేతం. ఈ దశలోకి వచ్చిన వారు ఆరోగ్యపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటారు. ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండటం ద్వారా వయసుతోపాటు వచ్చే శారీరక మార్పులను గమనించటం ద్వారా ఈ దశను సులభంగా దాటొచ్చు. ఈ దశలో వచ్చే మార్పులపై సమగ్రమైన అవగాహన ఉండటం ద్వారా వచ్చే సమస్యలను సులువుగా ఎదుర్కొనవచ్చు.



ఈ లక్షణాలు కనిపిస్తాయి...

- రుతుక్రమంలో ముందూ, వెనుకా రావటం
- శరీర భాగాలకు చెమటలు పట్టి చాలా వేడిగా ఉండటం
- నిద్రలోనూ విపరీతమైన చెమటలు, ఉన్నట్లుండి మెళకువ రావటం
- దినచర్యల్లో అనూహ్యంగా చిరాకు, కోపం, అసహనం
- గుండె దడ రావటం, వేగంగా కొట్టుకోవటం

క్రమం తప్పిందా?

మెనోపాజ్‌కు ఒకటి లేదా రెండేళ్ల ముందు నుంచే నెలసరి క్రమం తప్పుతుండటాన్ని గమనించొచ్చు. త్వరగానూ, ఆలస్యంగా రెండు, మూడు నెలలకొకసారి వస్తూ ఉంటుంది. రక్తస్రావం కూడా మరీ ఎక్కువ లేదా మరీ తక్కువగా అస్తవ్యస్తంగా వస్తూ ఉంటుంది. ఒక్కోసారి రెండు, మూడు నెలల పాటు ఏకధాటిగా రాకపోతే గర్భం వచ్చిందని కొంతమంది భయపడుతుంటారు. ఇలాంటి ఏమైనా తేడాలున్నప్పుడు డాక్టరును సంప్రదించి సూచనలు పాటించటం మేలు.

మూత్ర వ్యవస్థపై తీవ్ర ప్రభావం

మెనోపాజ్ ప్రభావం మూత్ర వ్యవస్థ, జననేంద్రియాలపైన కూడా పడుతుంది. దీనికిముందు వరకు యోని, మూత్రనాళం, మూత్రకోశాల్లో ఈస్ట్రోజెన్ రిసెప్టర్లు ఎక్కువగా ఉంటాయి. ఎప్పుడైతే ఈస్ట్రోజెన్ తగ్గుతుందో అప్పుడు ఆ కణజాలం బలహీనమై, పొడిబారిపోతుంది. అదే అసౌకర్యానికి, మంటకు దారితీస్తుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, కలయిక సమయంలో నొప్పి వంటివి సాధారణంగా వస్తుంటాయి. అండాశయాల నుంచి హార్మోన్ల విడుదల ఆగిపోవటం, ముఖ్యంగా ఈస్ట్రోజెన్ స్థాయి తగ్గటం వల్ల కొన్ని సమస్యలు కనిపిస్తూ ఉంటాయి. ఎముక లోపల కాల్షియం, విటమిన్ డి నిల్వలు తగ్గి అవి బలహీనంగా మారతాయి. క్రమంగా ఎముకలు గుల్లబారి మెత్తగా తయారవుతాయి. ఒళ్లంతా నొప్పులుగా అనిపించటం, చిన్న దెబ్బ తగిలినా ఫ్రాక్చర్లు కావటం లాంటివి ఆస్టియోపొరోసిస్‌ను సూచిస్తాయి. ఎముకల సాంద్రత తగ్గకుండా ఈస్ట్రోజెన్‌తోపాటు క్యాల్షియం, విటమిన్ డి తీసుకోవాలి. ఎముకల బలాన్ని పెంచే మందులను డాక్టరు సలహా మేరకు వాడాలి.

ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం

మెనోపాజ్ దశలో అజాగ్రత్తగా ఉంటే ఆ ప్రభావం మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఈస్ట్రోజెన్‌కి నాడీ వ్యవస్థను కాపాడే లక్షణం ఉంటుంది. ఎప్పుడైతే ఆ హార్మోన్ స్థాయి తగ్గుతుందో సమస్య మొదలవుతుంది. కండరాలు కూడా బలహీనమైపోతాయి. స్త్రీలలో గుండెపోటు చాలా అరుదుగా కనిపిస్తుంది. 50 సంవత్సరాలు దాటిన తర్వాత పురుషులతోపాటు స్త్రీలు కూడా గుండెపోటు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మోనోపాజ్‌కు ముందు వరకూ ఈస్ట్రోజెన్ గుండెను, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. యాభైఏళ్లు దాటిన తర్వాత రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవటం వల్ల అవి సన్నగా మారిపోతాయి. ఈ దశలోని మహిళలు అసహనంతో ఉంటుంటారు. అందువల్ల కుటుంబ సభ్యులు వారితో సంయమనంగా వ్యవహరించాలి.

క్రమబద్ధమైన జీవితం.. పౌష్టికాహారం

ఈ దశలోని మహిళలు కచ్చితంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం అరగంటకు తక్కువ కాకుండా వ్యాయామం చేయాలి. ప్రతిరోజూ శరీరానికి సూర్యరశ్మి అందేలా చూసుకోవాలి. విటమిన్ డి అందుతుంది. కాల్షియం పెంచే డ్రైఫ్రూట్స్, ఆహార పదార్థాలను తీసుకోవాలి. శరీరానికి అవసరమైన నిద్రను పోవాలి. ఒత్తిడి లేని క్రమబద్ధమైన జీవితాన్ని గడపాలి. సామాజిక మాధ్యమాల్లో గడిపే సమయాన్ని తగ్గించుకుని శారీరక శ్రమను పెంచుకోవాలి. ధ్యానానికి ఎంతోకొంత సమయాన్ని కేటాయించటం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా గడిపేందుకు ప్రయత్నించాలి. అతి ఆలోచనలు, ఒత్తిడులను క్రమంగా తగ్గించుకోవాలి. శరీరానికి పౌష్టికాహారాన్ని అందించేలా సోయా చిక్కుడు, చిక్కుడు, గుడ్లు, చేపలు తినాలి. మసాలాలు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలను తీసుకోవటం ఎంతో శ్రేయస్కరం. కప్పు పాలతో డ్రైఫ్రూట్స్ అన్నీ కాకుండా రోజుకొక రకాన్ని తీసుకోవటం మంచిది. వంటల్లో నూనెల వినియోగాన్ని బాగా తగ్గించుకోవాలి. ప్రతిరోజూ కనీసం 6 నుంచి 8 గంటలపాటు నిద్రపోవాలి. 5 నుంచి 6 గ్లాసుల వరకూ మంచినీరు తాగాలి. మజ్జిగ, కొబ్బరినీరు, ఫ్రూట్‌జ్యూస్ వంటివి తీసుకోవాలి.



- డాక్టర్ కోలా విజయకుమారి,
ఎండి (ఆయుర్వేదం)
ప్రసూతి స్త్రీ రోగ విభాగం అధిపతి,
డాక్టర్ అచంట లక్ష్మీపతి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి,
విజయవాడ.
94901 06269.



ఎన్టీఆర్‌కు ఘన నివాళి

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్‌టిఆర్) వర్ధంతి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ తనయుడు, సినీనటుడు నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ నటుడిగా, నాయకుడిగా, సిఎంగా ప్రజలకు చేసిన సేవలను గుర్తుచేశారు. ఆంధ్రాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరులు కూడా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, చాలామంది వచ్చి రక్తదానం చేశారు. బసవతారకం ఆసుపత్రిలో నందమూరి బాలకృష్ణ నివాళులర్పించారు. నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడనీ, అలాంటి వారికి మరణం ఉండదని బాలకృష్ణ అన్నారు.

షార్జాలో చిరంజీవి



షార్జా స్టేడియంలో మెగాస్టార్ చిరంజీవి సందడి చేశారు. యూఎఇలో ఇంటర్నేషనల్ లీగ్ టీ 20లో భాగంగా శుక్రవారం దుబాయ్ కేపిటల్స్, షార్జా వారియర్‌కు మధ్య జరిగిన మ్యాచ్‌ను ఐసిసి డైరెక్టర్ ముబాషిర్ ఉస్మాని, జిఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్‌కుమార్‌తో కలిసి చూశారు. దీనికి సంబంధించిన వీడియోను ఇంటర్నేషనల్ లీగ్ టీ 20 తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకుంది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

తెలుగులో 'ఐడెంటిటీ'



టోవినో థామస్, త్రిష జంటగా నటించిన మలయాళ చిత్రం 'ఐడెంటిటీ' త్వరలో తెలుగులో రానుంది. అఖిల్ బాయ్, అనాస్ ఖాన్ రచన, దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు మల్లియాత్, రాయ్ సిజె నిర్మాతలుగా వ్యవహరించారు. మలయాళంలో విడుదలైన ఈ చిత్రం రెండు వారాలలో రూ.50 కోట్లకు పైగా వసూలు చేసి 2025లో తొలి హిట్ సినిమాగా నిలిచింది. తాజాగా ఈ చిత్ర తెలుగు రైట్స్‌ని మన నిర్మాతలు సొంతం చేసుకున్నారు. మూవీ మాక్స్ శ్రీనివాస్ మామిడాల సమర్పణలో శ్రీ వేదాక్షర మూవీస్ చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలలో విడుదల చేస్తున్నారు. ఆద్యంతం అనేక మలుపులు తిరుగుతూ ఉత్కంఠభరితంగా సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఈ నెల 24న తెలుగు రాష్ట్రాల్లో విడుదలకు సిద్ధంగా ఉంది.

షమీ పునరాగమనం

సిరాజ్, చాహల్ ఔట్ • ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: గాయాల కారణంగా సుదీర్ఘ కాలం క్రికెట్‌కు దూరంగా ఉన్న మహ్మద్ షమీ ఛాంపియన్స్ ట్రోఫీతో పునరాగమనం చేయనున్నాడు. భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రకటించిన 15మంది ఆటగాళ్ల జాబితాలో షమీకి చోటు లభించింది. వాంఖడే మైదానంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలో శనివారం జరిగిన బిసిసిఐ సమావేశం బిసిసిఐ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ హాజరు కాలేదు. గైర్హాజరీపై గంభీర్ శుక్రవారమే తన నివేదికను బిసిసిఐ సమర్పించినట్లు సమాచారం. ఇక ఎనిమిది దేశాలు మధ్య జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి బిసిసిఐ ప్రకటించిన 15మందితో కూడిన భారత జట్టుకు కెప్టెన్‌గా రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నారు. పేసర్ మహ్మద్ షమీతో పాటు జస్ప్రీత్ బుమ్రా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌లకు చోటు లభించగా.. హైదరాబాద్ పేసర్ మహ్మద్ సిరాజ్, సీనియర్ స్పిన్నర్ యజ్ఞేంద్ర చాహల్‌లకు మొండిచెయ్యి ఎదురైంది. మార్పులు చేసుకోవడానికి ఫిబ్రవరి 13వరకు అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కూ ఇదే జట్టు కొనసాగుతుందని బిసిసిఐ వెల్లడించింది. ఈనెల 22నుంచి ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ జరగనుండగా.. ఆ తర్వాత ఫిబ్రవరి 6 నుంచి 12వరకు మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఎలో భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్‌తో ఫిబ్రవరి 20న, పాకిస్తాన్‌తో ఫిబ్రవరి 23న, న్యూజిలాండ్‌తో మార్చి 2న టీమిండియా తలపడనుంది. ఎనిమిదేళ్ల తర్వాత ఈ ఏడాది ఐసిసి ఛాంపియన్ ట్రోఫీ జరుగుతోంది.

ఈ టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యమిస్తుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. టీమిండియా 2013లో చివరిసారి గా ధోనీ నాయకత్వంలో టైటిల్ విజేతగా నిలిచింది.

ఛాంపియన్స్ ట్రోఫీకి భారతజట్టు:

రోహిత్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్(వైస్ కెప్టెన్), కోహ్లి, కేఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), శ్రేయస్, జడేజా, అక్షర్, సుందర్, హార్దిక్, కుల్దీప్, బుమ్రా, షమీ, అర్ష్‌దీప్.



క్రీడాకారులను అభినందిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు

ప్రజాశక్తి-పొదిలి (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా పొదిలిలో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా (లెగ్ వాలీబాల్) పోటీలు శనివారం ముగిశాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ప్రకాశం, ద్వితీయ స్థానంలో కర్నూలు, తృతీయ స్థానంలో అనంతపురం, తూర్పుగోదావరి జాయింట్ జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో తూర్పుగోదావరి, రెండో స్థానంలో ప్రకాశం, మూడో స్థానంలో అనంతపురం, విజయనగరం జాయింట్ జట్లు నిలిచాయి. సెపక్ తక్రా పోటీల్లో విజేతలకు సిఐ వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, సెపక్ తక్రా రాష్ట్ర కార్యదర్శి జి శ్రీనివాసులు, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలానీ భాష, వరికుంట్ల నిరంజన్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఫైనల్‌కు భారతజట్లు

ఖోఖో ప్రపంచకప్



న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్ ఫైనల్లోకి భారతజట్లు దూసుకెళ్లాయి. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన సెమీఫైనల్లో పురుషులజట్టు 66-16తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. కెప్టెన్ ప్రియాంక సెమీస్‌లోనూ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనను కనబర్చింది. తొలుత డిఫెన్స్‌కే పరిమితమైన అమ్మాయిలు ఆ తర్వాత ఉత్సాహంగా ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఖోఖో తొలి ప్రపంచకప్‌కు భారత్ ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. మరో సెమీస్‌లో నేపాల్ 72-20పాయింట్ల తేడాతో ఇరాన్‌ను చిత్తుచేసి ఫైనల్లోకి దూసుకొచ్చింది.ఇక మహిళల ఫైనల్లోనూ భారత్, నేపాల్ జట్లే ఫైనల్‌కు చేరాయి. శనివారం జరిగిన తొలి సెమీస్‌లో నేపాల్ మహిళలజట్టు 89-18పాయింట్ల తేడాతో ఉగాండాను చిత్తుచేయగా.. రెండో సెమీస్‌లో ఇండియా జట్టు 66-16పాయింట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. ఆదివారం భారత్-నేపాల్ జట్ల మధ్య టైటిల్ పోరు జరగనున్నాయి.

హాలీవుడ్ వేడుకలు వాయిదా

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో వ్యాపించిన కార్చిచ్చు వల్ల క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుక వాయిదా పడింది. లాస్ ఏంజెల్స్‌లో మంటలు ఇంకా అదుపులోకి రానందున ఈ అవార్డుల వేడుకను వాయిదా వేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ క్రిటిక్స్ ఛాయిస్ అవార్డులను జనవరి 12న నిర్వహించాలని మొదట భావించారు. కార్చిచ్చు అదుపులోకి రాకపోవడంతో వేడుకలను జనవరి 26కు వాయిదా వేశారు. తాజాగా ఇప్పుడు మరోసారి ఫిబ్రవరి 7కు రీ షెడ్యూల్ చేశారు. శాంటా మోనికాలోని బార్కర్ హ్యాంగర్‌లో ఈ ఈవెంట్ నిర్వహించనున్నట్లు సంస్థ పేర్కొంది. ఈ ఏడాది జరగనున్న క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల్లో సమంత-వరుణ్ ధావన్ నటించిన వెబ్ సిరీస్ 'సిటడెల్ : హనీ బన్నీ' పోటీ పడనుంది. ఉత్తమ విదేశీ భాష సిరీస్‌ల నామినేషన్‌లో ఇది చోటు దక్కించుకుంది. అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈ సిరీస్ అవార్డును సొంతం చేసుకుంటుందో, లేదో తెలియాలంటే ఫిబ్రవరి 7వరకు ఆగాల్సిందే.

ఈ కార్చిచ్చు కారణంగా ఆస్కార్ నామినేషన్ల ప్రక్రియ కూడా రెండుసార్లు వాయిదా పడింది. జనవరి 17న ప్రకటించాల్సిన ఆస్కార్ నామినేషన్లను మొదట జనవరి 19కు వాయిదా వేశారు. తాజాగా ఈ నామినేషన్లను జనవరి 23న ప్రకటించనున్నట్లు తెలిపారు. వరుసగా వేడుక వాయిదా పడుతుండడంతో ఈ ఏడాది ఆస్కార్ రద్దు అయ్యే అవకాశం ఉందంటూ వస్తోన్న వార్తలపై అకాడమీ సభ్యులు స్పందించారు. ఆస్కార్ వేడుకల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టంచేశారు. ఒకవేళ అలాంటిది ఉంటే ఫిల్మ్ అకాడమీనే స్వయంగా ప్రకటిస్తుందన్నారు. 1000 మంది ఈ వేడుకల వల్ల ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. 96 ఏళ్ల చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ ఈ ఈవెంట్‌ను క్యాన్సిల్ చేయలేదన్నారు. కొవిడ్ సమయంలోనూ వాయిదా మాత్రమే వేసినట్లు గుర్తుచేశారు.



'కన్నప్ప' ప్రమోషన్స్ ప్రారంభం

విష్ణు మంచు 'కన్నప్ప' చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల బెంగళూరులో ఈవెంట్ నిర్వహించారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 25న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న విష్ణు సినిమా విశేషాలు మాట్లాడారు. 'కన్నప్ప ప్రమోషన్స్‌ను కన్నడ నేల నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉంది. కన్నడ కంఠీరవ రాజ్ కుమార్ మొదటిసారిగా కన్నప్ప చిత్రాన్ని చేశారు. ఆ తరువాత శివ రాజ్ కుమార్ చేశారు. తెలుగులో బాపు రమణ దర్శకత్వంలో కృష్ణంరాజు భక్త కన్నప్ప చేశారు. మళ్లీ ఇప్పుడు మేం కన్నప్ప కథను చెప్పబోతున్నాం. ఈ తరానికి ఆయన చేసిన గొప్ప కార్యాలు ఏమిటో క్లియర్‌గా చూపించాలనే ఈ సినిమా చేస్తున్నాం. ఇండియా నుంచి టీంను న్యూజిలాండ్‌కు తీసుకెళ్లాం. ఇతర దేశాల నుంచి కూడా టెక్నీషియన్లను తీసుకొచ్చాం. నాకు ఈ కన్నప్ప ఎంతో ప్రత్యేకం' అన్నారు.



విజయ్ హజారే ట్రోఫీతో కర్ణాటక జట్టు ఆటగాళ్లు

విజేత కర్ణాటక

ఫైనల్లో విదర్భపై 36 పరుగుల తేడాతో గెలుపు

రాజ్‌కోట్: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్-2025 విజేతగా కర్ణాటక నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో కర్ణాటక 36 పరుగుల తేడాతో విదర్భను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 6వికెట్ల నష్టానికి 348పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేయగా.. ఛేదనలో విదర్భ జట్టు 48.2 ఓవర్లలో 312పరుగులకు కుప్పకూలింది. కర్ణాటక జట్టులో రవిచంద్రన్(101) సెంచరీకి తోడు శ్రీజిత్(78), మనోహర్(79) అర్ధసెంచరీలతో రాణించారు. టీమిండియా ఆటగాళ్లు, కర్ణాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్(32)కి తోడు దేవదత్ పడిక్కల్(21) నిరాశపరిచినా.. రవిచంద్రన్ అశ్విన్ లోయర్ ఆర్డర్ బ్యాటర్లతో కలిసి జట్టు భారీస్కోర్ చేసేందుకు దోహదపడ్డాడు. విదర్భ బౌలర్లలో దర్శన్, నిఛికెట్ రెండేసి వికెట్లతో రాణించగా.. యశ్, కదమ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో విదర్భ ఓపెనర్ ధృవ్ షోరే(110) సెంచరీతో రాణించినా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచా రు. జితేశ్ శర్మ(34) మాత్రమే ఫర్వాలేనిపించాడు. చివర్లో హర్ష్ దూబే(63; 30బంతుల్లో 5ఫోర్లు, 5సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్ తోడైనా.. భారీ లక్ష్యాన్ని దగ్గర్లో ఆలౌటయ్యింది. కర్ణాటక బౌలర్లలో కౌశిక్, ప్రసిధ్, అభిలాష్‌కి మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రవిచంద్రన్, సిరీస్ కరణ్ నాయర్‌కు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68